
బ్రహ్మర్షి పత్రీజీ దివ్య ఆశీస్సులతో...

# సత్యమార్గం

## తటవర్తి వీరరాఘవరావు




**అనుబంధం :** బ్రహ్మర్షి పత్రీ గారి శ్రీకృష్ణ సందేశం, భజగోవిందం, ఆత్మ విజ్ఞానం, భక్తియేముక్తి, శ్వాస విజ్ఞానజ్యోతి



# సత్యమార్గం



**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 9440309812, 94901 71853

# సత్యమార్గం


| | | |
|---|---|---|
| రచన | : | **తటవర్తి వీర రాఘవరావు** |
| మొదటి ముద్రణ | : | మే, 2008 |
| ప్రతులు | : | 2000 |
| రెండవ ముద్రణ | : | ఫిబ్రవరి, 2009 |
| ప్రతులు | : | 3000 |
| మూడవ ముద్రణ | : | నవంబరు, 2010 |
| ప్రతులు | : | 3000 |
| నాలుగవ ముద్రణ | : | నవంబరు, 2011 |
| ప్రతులు | : | 3000 |
| ఐదవ ముద్రణ | : | మార్చి, 2017 |
| ప్రతులు | : | 1000 |
| ఆరవ ముద్రణ | : | ఫిబ్రవరి, 2021 |
| ప్రతులు | : | 1000 |
| వెల | : | **రూ. 130/-లు** |



**పుస్తకముల కొరకు :**

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తి వారి వీధి,

**భీమవరం - 534 201.** ప॥గో॥జిల్లా.

సెల్ : 94403 09812, 94901 71853

email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | "గురుగీత!" | 5 |
| 2. | "శ్రీమద్ ఉత్తర గీతా సందేశం!" | 9 |
| 3. | "యోగి వేమన సందేశం!" | 13 |
| 4. | "శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సందేశం!" | 15 |
| 5. | "నిజమైన ఆరాధన!" | 19 |
| 6. | "దుఃఖ నివారణకు యోగుల సందేశం!" | 20 |
| 7. | భగవంతునికి ఏమి సమర్పించాలి? | 27 |
| 8. | "పూజ కాదు అంతర్‌శుద్ధి ముఖ్యం!" | 29 |
| 9. | "పూజలు, వ్రతాలు, ఆరాధనలు ఆధ్యాత్మికం కాదు!" | 30 |
| 11. | "నవ విధ భక్తులు!" | 32 |
| 12. | "భగవంతునికి సమర్పించవలసిన పుష్పాలు!" | 35 |
| 13. | "పూజ కాదు - సేవ ముఖ్యం!" | 37 |
| 14. | భగవంతునికి ఎందుకు నమస్కరించాలి? | 39 |
| 15. | దైవభీతి కాదు - పాపభీతి ఉండాలి | 41 |
| 16. | దేవుడు ఎవరు? | 43 |
| 17. | "దిగజారి ప్రవర్తించవద్దు!" | 44 |
| 18. | భగవంతుడు విగ్రహంలోనే వున్నాడా? | 46 |
| 19. | ఒరిజినల్ - డూప్లికేట్ | 51 |
| 20. | "గురువంటే?" | 54 |
| 21. | "గురువులలో రకాలు!" | 56 |
| 22. | శిష్యుడంటే? | 58 |

23. "గురు కృప ఉంటే!" 61

24. "గురువుల కోపం!" 63

25. "ధ్యానానికి ఆటంకాలు!" 65

26. "ధ్యాన సాధన ద్వారా మానవునిలో కలిగే పరివర్తన!" 68

27. "మాంసాహారం కొందరి మహాపురుషుల అభిప్రాయాలు!" 72

## అనుబంధం (బ్రహ్మర్షి పత్రీగారి)

1. శ్రీ కృష్ణ సందేశం 75

2. భజగోవిందం 111

3. ఆత్మ విజ్ఞానం 137

4. భక్తియే ముక్తి 155

5. శ్వాస విజ్ఞాన జ్యోతి! 167



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన* ***ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం*** *నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

***ప్రవేశం*** : *మూడురోజులకు భోజనం, వసతి ఉచితం*

***వేదిక*** : *శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,*** *భీమవరం - 534 201.*
*సెల్ : 94403 09812, 94901 71853*



# "గురుగీత!"

## పార్వతీ దేవి సందేహాలకు
## పరమేశ్వరుని సమాధానం

**పార్వత్యువాచ :-**

**శ్లో॥ ఓం నమోదేవ! దేవేశ! పరాత్పర! జగద్గురో!**
**త్వాం నమ స్కుర్వతే భక్త్యా సురాసురనరా స్సదా ॥**

**శ్లో॥ విధివిష్ణు మహేన్ద్రాద్యై ర్వన్ద్యం ఖలు సదా భవాన్**
**నమ స్కరోషి కస్మైత్వం నమస్కారాశ్రయః కిల ॥**

**శ్లో॥ దృష్ట్వా ఏతత్ కర్మ విపులం ఆశ్చర్యం ప్రతిభాతిమే**
**కిమే తన్న విజానేహం కృపయా వద మే ప్రభో! ॥**

పార్వతి పలికెను:-

ఓ దేవా! దేవేశా! పరాత్పరా! జగద్గురో! దేవతలు, రాక్షసులు, మనుజులు నిరంతరము భక్తితో నీకు నమస్కరించుచున్నారు.

మహేశ్వరా! నీవు బ్రహ్మా విష్ణు మహేంద్రుల చేత సదా స్తుతింపబడుచున్నావు. సర్వ దేవతలు నీకు నమస్కరించుచున్నారు. అట్టి నీవు ఎవరికి నమస్కరించుచున్నావు?

మీరు నమస్కరించడం చూసి నేను మిక్కిలి ఆశ్చర్యం పొందుచున్నాను. ఈ నమస్కారమునకు కారణమేమిటో నేను తెలియ లేకున్నాను. కనుక ఓ ప్రభో! దయ చేసి ఈ విషయము నాకు తెలుపుము.

**పరమేశ్వరుడు :-**

**శ్లో॥ అజోహ మజరం నిత్యమనాదిం నిత్యతాం గతం**
**అర్జవికారం చిదానందం ప్రణవాంతం స్మరామ్యహం**

దేవి, నేను జరామరణాలు లేనివాడిని. జన్మ బంధాలు లేని వాడిని, మృత్యుంజయుడను. అయినా, నేనూ నా హృదయంలో వున్న పరబ్రహ్మను నిత్యం ఆరాధిస్తాను.

పరబ్రహ్మ కాలాతీతుడు, నిత్యచైతన్యం, బ్రహ్మనికి వార్ధక్యం, క్షతి లేదు. ఆయన అనంతుడు, శాశ్వతుడు. ఆది, అంతం లేనివాడు. పరిణామం చెందనివాడు. పరబ్రహ్మ అనగా విశ్వ చైతన్యమే! సచ్చిదానందాన్ని మించిన బ్రహ్మానందం.

నావలె ప్రతియోగి, ప్రతిసాధకుడు తన హృదయంలో, చిదా కాశంతో, అంగుష్టమాత్రుడై వెలిగే పురుషుని, జీవుని, జ్యోతిని ఆరాధించాలి. మనిషిగా జన్మించిన జీవికి పరంజ్యోతి దర్శనం ప్రధమాశయం కావాలి.

**శ్లో॥ కేన మార్గేణ లో స్వామిన్ దేహి బ్రహ్మమయోభవేత్**
**తత్ కృపాం కురుమేస్వామిన్ నమామి చరణేతవ.**

"స్వామి! ఏ తపస్సు చేసినా, బ్రహ్మనుభూతి ముఖ్యం కదా? అటువంటి బ్రహ్మనుభూతిని పొందగల మార్గం ఏది? ఆ మార్గాన్ని నాకు ఉపదేశించండి. నేను మీకు సంపూర్ణంగా శరణాగతురాలిని అవుతున్నాను. తమరిని నా గురువుగా భావిస్తున్నాను. నన్ను అనుగ్రహించండి మహాత్మా."

**శ్లో॥ అపూర్వా నందతం నిత్యం స్వయం జ్యోతిర్నివామయం**
**విరజస్కం పరంశంభుం ఆనందం పరమ వ్యయం.**

పరబ్రహ్మాన్ని గుర్తించడం సులభం కాదు. ఊహించినంత తేలిక కాదు. పరబ్రహ్మకు రూపం, గుణం లేవు కనుక ఫలానా రూపం, ఫలానా గుణమని చెప్పలేం. కొన్ని సంకేతాలు వున్నాయి. అవి అనుభూతికి తెలుస్తాయి. అపూర్వమైన ఆనందం కలిగించే గుణం పరబ్రహ్మది. ఆ ఆనందం వ్యక్తం చేయ వీలుకాదు కనుక అది అవ్యక్తానందం. అది యోగి మాత్రమే గ్రహించగల, అనుభవించగల మధురానందం. అది

ఎప్పటికప్పుడు క్రొత్తగా అనిపిస్తుంది. కనుక నిత్య నూతనం. అది దివ్య పరిమళభరితం. అది ఆత్మ జ్యోతి. హృదయంలో చల్లగా, నెమ్మదిగా వెలుగుతుంది, ప్రకాశిస్తుంది. లోకంలోని ఏ సుఖంతో కాని, సంతోషంతో కాని, బ్రహ్మానందాన్ని పోల్చలేం.

**శ్లో ॥ అగోచరం, తధాగమ్యం నామరూపాది వర్జితం**
**నిశ్శబ్దం తం విజా నీయాత్ స్వభావం బ్రహ్మ పార్వతి.**

పార్వతీ! పరబ్రహ్మం అగోచరం. ఎక్కడా కనిపించదు. కనువిందు చేయదు. పైగా అగమ్యం. అంటే ఈ మార్గాన వెతుకుతే దొరుకుతుందని చెప్పలేం. ఏ మార్గమో తెలియదు. బ్రహ్మాన్ని చేరాలంటే అసలు మార్గమేలేని మార్గంలో ప్రయాణం చెయ్యాలి.

ఆ బ్రహ్మానికి రూపం లేదు, పేరు లేదు. ఆయన్ను అన్వేషించేవారికి దేహస్మృతి ఉండకూడదు. తన ఊరు, పేరు, ఉనికి మరిచిపోవాలి. మరో కంటితో చూడాలి. అదే జ్ఞాన నేత్రం. జ్ఞానికి మాత్రమే అందేది పరబ్రహ్మ తత్వం. మానవులకు, సమస్త జీవజాలానికి సుఖాలు ప్రసాదించేది, మనుగడకు సహకరించేది పరబ్రహ్మమే. ఆయన ఆవాసం నిశ్శబ్దం, ప్రశాంతి.

**శ్లో॥ యధా నిజ స్వభావేన కర్పూర కుసుమాదిషం**
**శీతోష్ణాది స్వభావశ్చ తథా బ్రహ్మచ శాశ్వతం**

మానవులను రూప, గుణ, స్వభావాలను బట్టి గుర్తించవచ్చు. రూప ప్రపంచంలో చరాచరాలన్నింటికి రూపం వుంటుంది. కొన్నింటికి స్వభావం ప్రధానం (కర్పూరానికి వేడిచేసే గుణం వున్నట్లు, పూలకు చలవ చేసే గుణం వున్నట్లు) పరబ్రహ్మకు అనంతత్వం గుణ స్వభావం అందుచేత శాశ్వతుడైన పరబ్రహ్మను తాత్వికంగానే గుర్తించగలం. ఇతరాలైన రూప, నామ, గుణ స్వభావాలతో మాత్రం వీలుపడదు.

**శ్లో॥ అంకి మత్ర బహునోక్తేన శాస్త్రకోటి శతే నచ**
**దుర్లభా చిత్త విశ్రాంతిః సద్గురోః కరుణం వినా!**

శాస్త్రాలకేం వందలు వేలు వున్నాయి, ఎన్ని శాస్త్రాలు చదివినా,

ఎంతగా శాస్త్రపాండిత్యం గడించినా, ఆత్మకు శాంతి లభించదు. ఎంత వెతికినా శాస్త్రాలలో సరైన ముక్తిమార్గం కనిపించదు. మనశ్శాంతి కరువై, చిత్తచాంచల్యంతో కొట్టుమిట్టాడే వానికి సద్గురువు లభిస్తే శాస్త్రపాండిత్యంతో పని ఉండదు. సద్గురువు తప్ప పరవిద్యను బోధించగల వారు ఎవరూ ఉండరు. ఏ శాస్త్రమూ గురువు చేసే పని చేయదు.

ధ ధ ధ

పరమేశ్వరుడు ఇంకా ఏమన్నారంటే! నాలోనే కాదు, సకల దేవతలలో, మానవులలో, సమస్త జీవులలో జ్యోతిలా వెలిసే! కనిపించని, వ్యక్తం చేయలేని పరబ్రహ్మను నేను నిత్యం ధ్యానిస్తున్నాను. అంతటి గొప్పవాడైన పరబ్రహ్మను రూపంతో, నామంతో, గుణంతో తెలుసుకోలేము. ఆయనను ఈ కళ్ళతో చూడలేము. ఆ తత్వాన్ని జ్ఞాననేత్రంతోనే దర్శించుకోగలము. దేహస్మృతి మరచిపోవాలి. అదే నేను చేస్తున్నాను. నీవు కూడా ఆయన్నే ధ్యానించు అని చెప్పడం జరిగింది.

మానవునిగా జన్మించిన ప్రతీ ఒక్కరు తన హృదయంలో వెలిగే పురుషుని అంటే ఆత్మని ఆరాధించాలి. అదే ప్రతీ ఒక్కరి మొదటి ఆశయం కావాలి అంటే పరబ్రహ్మదర్శనమే జీవిత లక్ష్యం కావాలని పరమేశ్వరుడు బోధించారు.

పరమేశ్వరుని పై సందేశాన్ని బట్టి ఆ బ్రహ్మానుభూతి పొందాలంటే, దేహ స్మృతి ఉండకూడదు. తన ఊరు, పేరు, ఉనికి మరిచిపోవాలి అని తెలుసుకోవాలి. మరి దేహస్మృతి అంటే దేహభావం మనసు వల్ల కలుగుతుంది కాబట్టి మనసును శూన్యం చేసుకోవాలి. ఆ మార్గమే "శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం" చెయ్యడం.

అలా విశేషమైన ధ్యానం చెయ్యడం ద్వారా 'జ్ఞాననేత్రం' సంపాదించుకోవచ్చు. బ్రహ్మానుభూతి పొందవచ్చు. అందుచేత పరమేశ్వరుడు బోధించిన ప్రకారం నామ, రూపాలను వదలి బ్రహ్మర్షి పత్రీజీ బోధించే శ్వాస మీద ధ్యాస 'ధ్యానం' ద్వారా, జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.

ఇతరుల 'చరణా'లను వదలి 'ఆచరణ'ను
మొదలుపెట్టుదాం. - బ్రహ్మర్షి పత్రీజీ



# "శ్రీమద్ ఉత్తర గీతా సందేశం!"

శ్లో॥ **దేహో దేవాలయః ప్రోక్తో జీవోదేవస్సనాతనః**
**త్య జేదజ్ఞాన నిర్మాల్యం సోఽ హం భావేన పూజియేత్ ॥**

ఈ దేహం దేవాలయమని చెప్పబడినది. దేహంలో వున్న జీవుడే సనాతనుడైన సాక్షాత్ దేవుడని తెలుసుకోవాలి. అట్టి దేవుని ఆత్మానాత్మ వివేకము చేత అజ్ఞానమనెడి నిర్మాల్యమును వదలి "అహం బ్రహ్మాస్మి" అనే భావంతో అంటే తనయందున్న ఆత్మ స్వరూపుడైన పరబ్రహ్మమును పూజించాలని తెలుసుకోవాలి.

దీనిని బట్టి ఎవరైనా సరే ఆత్మను ఆరాధించాలని తెలుస్తుంది.

**శ్లో॥ బహిర్థాయ్యతియః కశ్చిత్యక్త్వా దేహస్థ మీశ్వరం ।**
**స్వగృహో పాయసం త్యక్త్వా బిక్షామటతి దుర్మతి ॥**

తన దేహమందున్న ఈశ్వరుని వదలి బయట ఎచ్చటనో ఈశ్వరుడున్నాడని భ్రమించి తిరుగువాడు తన ఇంటిలో నున్న క్షీరాన్నమును (పాయసం) విడిచి పెట్టి పొరిగింటి బిక్షపు కూటికై తిరుగు మూర్ఖునితో సమానుడని తెలుసుకోవాలి.

**శ్లో॥ "తీర్థానితోయ రూ పాణీ దేవాన్ పాషాణ మృణ్మయాన్ ।**
**యోగినో నప్రపద్యంతే ఆత్మధ్యాన పరాయణాః ॥"**

ఆత్మధ్యానం పట్ల ఆసక్తి గల యోగులు. తీర్థాలనూ, రాళ్ళతోనూ, మట్టితోనూ చేయబడిన విగ్రహ రూప దైవాలను సేవించరు.

**శ్లో॥ శిలామృద్దారు పాత్రేషు దైవబుద్ధిః ప్రకల్పితః**
**అకల్పిత స్వయం జ్యోతి రాత్మానో దేవతా నకా ॥**

శిలల చేతను, మట్టి చేతను, కొయ్య చేతను చేయబడిన విగ్రహములందు దైవము అనే బుద్ధి కలుగుట కల్పితమైనది. ఎందుకనగా! స్వయం జ్యోతి స్వరూపుడైన ఆత్మ అకల్పితుడు అనగా ఎవరి చేతను కల్పించబడని పరబ్రహ్మమని తెలుసుకోవాలి. అందుచేత కల్పించబడిన

దేవతలతో మనకేమి పని? కల్పిత విగ్రహములను ఆరాధింపక స్వయం జ్యోతి స్వరూపుడైన అకల్పిత 'ఆత్మ' ఆరాధన చేసి మోక్షం పొందటానికి ప్రయత్నించాలి.

**శ్లో॥ "పూజాకోటి సమంస్తోత్రం స్తోత్రకోటి సమోజపః ।**
**జపకోటి సమం ధ్యానం ధ్యానకోటి సమోలయః ॥**

కోటి పూజలతో సమానం ఒక స్తోత్రమనీ, కోటిస్తోత్రాలతో సమానం ఒక జపమనీ, కోటి జపాలతో సమానం ఒక ధ్యానమనీ, కోటి ధ్యానాలతో సమానం ఒక లయయనీ తెలుసుకోవాలి. **"మనోలయమే మోక్షం."**

**శ్లో ॥ నాస్తి ధ్యాన సమం తీర్థం. నాస్తి ధ్యానసమం తపం!**
**నాస్తి ధ్యాన సమం యజ్ఞం, తస్మాత్ ధ్యానం సమాచరేత్॥**

తీర్థములు కాని, జపతపాలు కాని, యజ్ఞయాగాలు కానీ, ఏవీ ధ్యానానికి సమం కాదని తెలుసుకోవాలి.

**శ్లో॥ "అగ్నిర్దేవో ద్విజాతినాం, మునినాం హృదిదైవతమ్!**
**ప్రతిమా స్వల్ప బుద్ధీనాం సర్వత్ర సమదర్శినామ్ ॥**

బ్రాహ్మణులకు అగ్నియే దేవుడు. మునులకు హృదయమందున్న చైతన్యమే దేవుడు. అజ్ఞానులు. అల్పబుద్ధులయిన మంద బుద్ధిగల మానవులకు శిలాప్రతిమలే దేవుడు. కాని సమదృష్టి గలవారలకు (బ్రహ్మజ్ఞానులకు) సర్వ ప్రపంచమంతయు దేవుడే అవుతాడు.

**శ్లో॥ హృదయ కమల మధ్యే దీపపద్వేవసారం**
**ప్రణవమయ మతర్క్యం యోగీ హృద్యానగమ్యం;**
**అజహరి శివ యోగం సర్వ భూతస్థమేకం.**
**సకృదపి మనసా మాం ధ్యాయతే యస్స ముక్తః ॥**

హృదయ కమల మధ్యమునందు దీపమువలె ప్రకాశించు వాడును, వేదముల యొక్క సార స్వరూపు డును, ప్రణవస్వరూపుడును. తర్కములచేత పొందబడని వాడును, యోగుల హృదయమునందు దర్శన మిచ్చువాడును, బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపుండును, ఏకరూపుడై సర్వభూతముల యందు అంతర్యామియై ఆత్మ స్వరూపముగా నున్న వాడనగు నన్ను ఎవడు సన్మార్గము చేత మనస్ఫూర్తిగా విశ్వసించి ధ్యానించు చున్నాడో అట్టివాడు ముక్తుడగుచున్నాడు.

శ్లో॥ "సర్వత్రా వస్థితం శాంతం నప్రపకే జ్జనార్ధనమ్ ।
జ్ఞాన చక్షుర్విహీనత్వా దంధ సూర్య మివోదితమ్ ॥"

"గుడ్డివాడు సూర్యోదయాన్ని చూడలేనట్టు 'జ్ఞాననేత్రం' లేనివాడు సర్వత్రా వ్యాపించి ఉన్న శాంత స్వరూపుడైన జనార్దనుని చూడలేడు."

శ్లో॥ ధ్యానా ఖ్య యోగారణి దీపితేన పంచాత్మకం ధర్మ గుణేం ధనేన ।
యోగాగ్నినా వాయు సమన్వి తేన దగ్ధం యుగాంతే ఖిలం కర్మబంధనమ్॥"

'ధ్యానయోగం' అనే అరణిలో ప్రజ్వలిస్తున్న అగ్నిలో ...ధర్మ గుణాలనే కట్టెలచేత, మనస్సును మథించడం వలన యోగాగ్ని రగిలి...జ్ఞానాగ్ని ఉత్పత్తి అవుతుంది. దీని వలన 'యుగాంతం' లో ... అంటే చివరిదశలో సమస్త కర్మ బంధాలూ దహింపబడి బ్రహ్మ సాక్షాత్కార సిద్ధి... అంటే నిర్వాణం కలుగుతుంది."

శ్లో॥ బ్రహ్మహత్యా సహస్రాణి భ్రూణ హత్యాశతావిచ!
ఏకోహి ధ్యాన యోగశ్చరహత్యగ్నిరివింధనమ్॥

వేలకొలది బ్రహ్మ హత్యల వలన, వందల కొలది భ్రూణ హత్యల వలన కలిగిన పాపములను ఒక్క ధ్యాన యోగము మాత్రమే, కట్టెలను దహించునట్లు దహించి వేయును.

శ్లో॥ అశ్వమేధ సహస్రాణి రాజపేయ శతావిచ!
ఏకస్య ధ్యాన యోగస్య కళాం వార్ధతి షోడసోమ్!

వేలకొలది అశ్వమేధ యాగములు చేసినా, వందల కొద్దీ జప యజ్ఞములు చేసినా గాని, షోడశ కళా ప్రపూర్ణుడయిన ఆత్మయోగి యొక్క ఒక్క భాగమునకు సమానము కాదు.

శ్లో॥ నిమిషం నిమిషార్ధం వా జ్ఞానినో ధ్యానచింతయా ।
క్రతు కోటి సహస్రాణాం ధ్యానమేకం విశిష్యతే ॥"

" ఆత్మ జ్ఞానులు నిమిషం గానీ, అర నిమిషం గానీ ధ్యానం ద్వారా 'బ్రహ్మనిష్ఠ' పొందడం వల్ల వేయికోట్ల క్రతువులు చేసిన ఫలం వస్తుంది కాబట్టి ధ్యానం ఒక్కటే విశిష్ఠమైనదని చెప్పబడింది."

శ్లో॥ "బ్రహ్మ బేధే నజానాతి ముక్తిం నైవ ప్రపద్యతే ।
సమాసం సర్వ జంతూనాం బ్రహ్మసూత్రేణ కథ్యతే ॥"

"జీవ బ్రహ్మలలో అంటే జీవాత్మ, పరమాత్మలలో... భేధం లేదని

తెలియని వాడు ఎప్పటికీ ముక్తిని పొందలేడు. సమస్త జంతువులలోనూ పరబ్రహ్మ యొక్క చైతన్యశక్తి సమానంగా ఉన్నదని తెలుసుకున్నవానికే ముక్తి కలుగుతుంది."

**శ్లో॥ "భూత వస్తు న్యశోచిత్వే సిద్ధే చాగామి వస్తుని।**
**సిద్ధేచ నిరపేక్ష త్వే పునర్జన్మ న విద్యతే॥"**


"యోగి అయిన వాడికి పోయిన వస్తువును గురించి విచారం గానీ, రాబోయే వస్తువును గురించి ఆసక్తి గానీ వుండదు. లభించిన వస్తువుల పట్ల కూడా నిరాశక్తుడై ఉంటాడు. అటువంటి వాడికి ఇక పునర్జన్మ అనేది ఉండదు. అంటే అలాంటివాడికి ముక్తి లభిస్తుందని తెలుసుకోవాలి." ఆత్మధ్యానులు విగ్రహారాధన చేయరు.

భగవంతుని కోరే వారికి ప్రారంభ దశలో మనస్సు నిలకడగా ఉండదు కనుక మట్టితోను, రాళ్ళతోను, చెక్కలతోను చేయబడిన విగ్రహ రూప దైవాలను కల్పించారు. పురాణాలలో విగ్రహారాధన గురించి "అధమా ప్రతిమా పూజా" అని చెప్పబడింది.

చాణక్యుడు తన 'నీతిసారం'లో 'ప్రతిమా అల్ప బుద్ధినాం' అంటే 'అల్ప బుద్ధులకే ప్రతిమా పూజలనీ', 'మూర్తి పూజ మూర్ఖుల కొరకే' అని తెలిపారు. కాబట్టి ఆత్మజ్ఞాన పరాయణులు అజ్ఞానులలాగ తీర్థాలను, మానవ కల్పితాలూ, జడ స్వరూపాలూ అయిన విగ్రహాలను సేవించరు.

అలా ఏ విధంగా ఆలోచించినా తత్వ చింతన ఉత్తమమని, శాస్త్ర చింతన మధ్యమమని, గుళ్ళు, గోపురాలు, తీర్థ యాత్రల చింతన అధమమని సంసార చింతన అధమాధమమని తెలుస్తుంది.

# "యోగి వేమన సందేశం!"



**"బ్రహ్మమనంగ వేరెపరదేశమున లేదు!**
**బ్రహ్మమనగ దానె బట్ట బయలు!**
**తన్ను దానెరిగిన దానెపో బ్రహ్మంబు!**
**విశ్వదాభిరామ వినుర వేమ!"**

భగవంతుడంటే వేరే ఇతర క్షేత్రాలలో లేడు. మానవులు భగవంతుడు ఎక్కడో వున్నాడని వెతుకు తున్నారు. కానీ తానే భగవంతుడనని తెలుసుకోలేక పోతున్నారు. అసలు తానెవరో తాను తెలుసుకుంటే తానే భగవంతుడని తెలుస్తుందని వేమన యోగీంద్రులు చెపుతున్నారు.

"అహం బ్రహ్మోస్మి" అంటే నేను భగవంతుడినై వున్నాను అన్న వేదవాక్యాన్నే యోగివేమన తెలియ చేస్తున్నారు.

**"శిలలను చూసి శివుడని భావింత్రు!**
**శిలలు శిలలె కాని శివుడు కాదు!!**
**తనదులోని శివుని తానేల తెలియడో?!**
**విశ్వదాభిరామ వినుర వేమ!"**

మానవులు రాతి విగ్రహాలను చూసి భగవంతుడనుకుంటున్నారు. శిల శిలే అవుతుంది కానీ భగవంతుడెలా అవుతాడు? అసలు తనలో వున్న భగవంతుడ్ని మానవుడు ఎందుకు తెలుసుకోలేక పోతున్నాడు? అని వేమన యోగీంద్రులు చెపుతున్నారు.

**"సంధ్య వార్వగనేమి? జపము చేయగనేమి?**
**వేద శాస్త్రములనుతెలియనేమి?**
**పరముగనని వాడు బాపడు కాడురా**
**విశ్వదాభిరామ వినురవేమ!"**

సంధ్యావందనాలు చేస్తే ప్రయోజనమేమిటి? జపాలు చేస్తే ప్రయోజనమేమిటి? వేద శాస్త్రాలన్నీ చదివితే మాత్రం ప్రయోజనమేమిటి?

ఆ భగవంతుని తెలుసుకోలేని వాడు బ్రాహ్మణుడు కాదని వేమన తెలియ చేస్తున్నారు.

**"కల్లగురుడు కట్టు కర్మ చయంబులు;**
**మధ్య గురుడు కట్టు మంత్రచయము;**
**వుత్తముండు గట్టు యోగ సామ్రాజ్యంబు!**
**విశ్వధాభిరామ వినురవేమ!"**

మోసకారియైన గురువు వ్యర్థమైన కర్మకాండలు చేయిస్తాడు. కొంచెం అవగాహన వున్న గురువు మంత్ర జపాలు చేయిస్తాడు. కానీ ఉత్తముడైన బోధ గురువు 'ధ్యానం' ద్వారా మానవ లక్ష్యమైన మోక్షాన్ని పొందే అవకాశం కల్పిస్తాడు.

**పూజ సేయ సేయ పూజారి తానాయె**
**పూజ్య వస్తువెన్న భువిని తానె!**
**యాడ పూజ సేయు? నెల్లదిక్కుల తానే!**
**తానె నేను, నేను తానె వేమ!"**


పూజ చేస్తే పూజారి అవుతాం. అంతకు మించి ప్రయోజనం వుండదు. భూమి మీద పూజింప తగ్గ వస్తువు తానే అని వేమన యోగీంద్రులు తెలియ చేస్తున్నారు. ఎక్కడ పూజ చేస్తాం? అన్ని దిక్కుల మనమే కదా? ఆ భగవంతుడే మనం, మనమే ఆ భగవంతుడు అని వేమన చెపుతున్నారు.

**అంటే నేనే అంతా, అంతా నేనే అని చెప్తున్నారు.** అందుచేత మనల్ని మనమే పూజించుకోవాలి. దానినే భక్తి అంటారు. ఇదే ఉపనిషత్తులలో కూడా చెప్పబడింది.

"స్వస్వరూపానుసంధానం భక్తి రీత్యభిధీయతే"

అంటే ధ్యానం చెయ్యడమే భక్తి అని తెలుసుకోవాలి. ఇదే వేమన సందేశం కూడా!

# "శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సందేశం!"



**"ముక్కు మొగము చెక్కి మూర్తి పూజలు చేయ**
**తొలుత చేయు దోసగు తొలగబోదు**
**మనసు నిలుప జనన మరణాలు తొలగును**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

రాళ్లకు, చెక్కలకు ముక్కు మొహం చెక్కి, శిల్పంగా తయారు చేసి దానికి బొట్లు పెట్టి, వస్త్రాలు చుట్టి, పువ్వులు పెట్టి, అగరత్తులు వెలిగించి, హారతులిచ్చి, ఎన్ని పూజలు చేసినా ముందు చేసిన పాపాలు తొలగవు అంటున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి వారు.

దుఃఖ భూయిష్టమైన జననం, మరణం అన్నవి మనస్సు నిల్పి ధ్యానం చేస్తేనే తొలుగుతాయి తప్ప పూజల వల్ల ఎంత మాత్రం లాభం లేదని వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

**"సాటి మానవునకు సాయమ్ము పడబోక,**
**నల్లరాళ్ళు తెచ్చి గుళ్ళు కట్టి**
**మ్రొక్కులిడిన బ్రతుకు చక్కపడంబోదు**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

మనమే గుళ్ళు కట్టి, రాళ్ళు తెచ్చి అందులో పెట్టి, మన కష్టాలు తీర్చమని, కోరికలు నెరవేర్చమని మ్రొక్కులు మ్రొక్కితే మన బ్రతుకేమైనా చక్కబడుతుందా?

మన జీవితం బాగుండాలంటే సాటి మానవులకు సాయం చెయ్యాలి అంటే మంచి చెయ్యాలని బోధిస్తున్నారు వీరబ్రహ్మేంద్రస్వామి వారు.

**"రూప రహితునకు రూపమ్ము గల్పించి**
**కర్మ కాండ పెంచి కలుషమతులు**
**ధర్మమార్గములను ధ్వంసమ్ము చేసిరి**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

రూపంలేని భగవంతునికి రూపాన్ని తయారు చేసి, కర్మకాండ అంటే నిద్రపోని భగవంతునికి పవళింపు సేవలు చేస్తూ, సుప్రభాతం పాడి నిద్రలేపుతూ, మురికి అంటని భగవంతునికి అభిషేకాలు చేస్తూ,

చావుపుట్టుకలు, ఆకలి లేని భగవంతునికి నివేదనలు చేస్తూ, కలుషిత మనస్కులైన స్వార్థపరులు భగవంతుని దర్శించే ధర్మమైన, 'ధ్యానమార్గాన్ని' ధ్వంసం చేశారని వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

**"స్నానమందు లేదు, పానమందు లేదు**
**మంత్రతంత్రములను మహిమ లేదు!**
**గుణము కుదిరె నేని ఘన యోగితానౌను**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

ఏ గోదావరి పుష్కరాలు, కృష్ణా పుష్కరాలు, గంగా పుష్కరాలు... ఎక్కడ మునిగి స్నానం చేసినా లాభం లేదు. గంగా తీర్థాన్ని కానీ, గుళ్ళో తీర్థాన్ని కానీ పానం చేసినా లాభం లేదు.

అలాగే మనస్సుతో జపించే మంత్రాల్లో కానీ తనువుతో చేసే ప్రదక్షణాలు, పొర్లుదండాలు, సాష్టాంగ ప్రమాణాలు, గుంజీలు, లెంపలు వేసుకోవడాలు, ఇంకా రకరకాలుగా శరీరాన్ని హింసించుకోవడాలలో మహిమ లేదు. అంటే తనువుతో ఏది చేసినా, మనస్సుతో ఏది చేసినా దుఃఖం నుండి ముక్తి లభించదు. కారణం వాటిలో మహిమ లేదని వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

మంత్రమంటే "మననాత్ త్రాయతే ఇతి మంత్ర" అన్నారు. అలాగే తంత్రమంటే "తనునాత్ త్రాయతే ఇతి తంత్రః" అన్నారు. అంటే మనస్సుతో చేసేది మంత్రం. తనువుతో చేసేది తంత్రం అని అర్థం.

గుణము కుదిరినేని అంటే పనికి రాని తమోగుణం పోవాలి. పనికి రాని రజోగుణం పోవాలి. అలాగే సాత్వికగుణం కూడా పోవాలి. నిర్గుణుడు కావాలి. వాడే ఘనమైన యోగి. వాడే దుఃఖాన్ని శాశ్వతంగా నివారించుకుని మోక్షాన్ని పొందినవాడని వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

**"తీర్థయాత్రలందు దేవుడొక్కడే గదా**
**మంచి తీర్థము మన పంచ నుండె**
**దివ్య తీర్థమిదిగో దేహమందున్నది**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

భద్రాచలంలో ఒక దేవుడు, తిరుపతిలో ఒక దేవుడు, కాశీలో ఒక దేవుడు, మక్కాలో ఒక దేవుడు, జెరూసలేంలో మరియొక దేవుడూ లేడు. సకల తీర్థ యాత్రలలోనూ వున్నది ఒక్కటే దైవతత్వం. అటువంటి

మంచి తీర్థం మన వద్ద వుంది. ఆ దివ్య తీర్థం మన దేహంలో వుంది. అంటే మన దేహంలోనే మనం వెతుక్కోవాలి. అంటే ధ్యానం చెయ్యాలని వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

**"వెదకి వెదకి వెదకి వేసారి వేసారి**
**అచట నిచట లేడటంచు నెంచి**
**తరచి చూచి తాను తనలోన గనుగొనె**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

భగవంతుని కోసం ఎక్కడెక్కడ తిరుగు తున్నాడో మానవుడు. ఎన్ని దేవాలయాలకు, ఎన్ని తీర్థాలకు, అలా వెదకి, వెదకి అలసిపోయాడు. చివరకు అక్కడా, ఇక్కడా ఎక్కడా లేడని, తిరిగి, తిరిగి చివరకు 'ధ్యానం' చేసి తనలోనే వున్నాడని తెలుసుకుంటున్నాడు అని వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

**"దివ్య మంగళమ్ము దేవతాబింబమ్ము**
**ఉల్లమందునున్న ఉపము గనక**
**యాత్రలెల్ల దిరిగి యాతన పడనేల?**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

దివ్యమైన దేవతాబింబం అంటే ఆత్మ! ఈ శరీరంలోనే వుంటే, ఎక్కడెక్కడో యాత్రలకు తిరిగి, ఎన్నో యాతనలు పడడమెందుకు? ఏ యాత్రకు వెళ్ళవలసిన అవసరం లేదు. మన శరీరమే దివ్య మంగళమైన సర్వక్షేత్రం అని వీర బ్రహ్మేంద్ర స్వామి వారు చెపుతున్నారు.

**"బుజము గాల్చుకొన్న బుజముపై జందెపు**
**పోగు వేసికొన్న ముక్తిరాదు**
**నేను మేనులోన నేనెరింగిన ముక్తి**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

బుజం కాల్చుకుంటే, బుజంపై జందెపు ప్రోగు వేసు కుంటే ముక్తి వస్తుందని అనుకుంటున్నారు ఈ అజ్ఞానులు.

ఈ 'మేను'లో ఒక 'నేను' వుంది. 'నేను'లో మరొక 'నేను' వుంది. అది తెలుసుకున్నప్పుడే సమస్త దుఃఖాల నుండి ముక్తి. మేను లోపల 'అహంకార'మనే జీవుడు, లోపల 'సర్వాత్మ' అనే మరొక 'నేను' వున్నది. ఆ నేనును తెలుసుకుంటేనే 'ముక్తి' వస్తుందని తెలుసుకోవాలి.

**“దృష్టి నిలిపెనేని దేవుడు దిగి వచ్చు**
**దృష్టి నిలుపదేని నష్టపడును**
**దృష్టిలోన సర్వ సృష్టి పుష్టమౌను**
**కాళికాంబ! హంస! కాళికాంబ!”**

అందుచేత దృష్టి నిలిపి ధ్యానం చేస్తే ఆ దేవుడే దిగి వస్తాడు. దృష్టి నిలపకపోతే అంటే ధ్యానం చెయ్యకపోతే అన్నీ నష్టాలే. అనారోగ్యం, అశాంతి, భయం, దుఃఖం, నిరుత్సాహం, కోపం లాంటివెన్నో, కానీ దృష్టిలో అంటే ధ్యానంలో సకల సృష్టి గురించి తెలుసుకోగలం.

**“ఆటవికులకెల్ల ఆధ్యాత్మతత్వమ్ము**
**బోధ చేసి పూర్ణపురుషులుగను**
**తీర్చి దిద్దు వారె దేవతామూర్తులు**
**కాళికాంబ! హంస! కాళికాంబ!”**

నాగరికత లేని అజ్ఞానులకు భగవంతుని తత్వాన్ని బోధించి, వారిని సరైన ‘సత్యమార్గంలో’ నడిపించి వారిని కూడా పూర్ణ పురుషులుగా అంటే జ్ఞానులుగా తీర్చిదిద్దేవారే’ దేవతా స్వరూపులు అని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారు తెలియచేస్తున్నారు.

భగవంతుడు ఎవరు? ఎక్కడ వుంటాడో తెలియక? పూర్వం నుంచి ఆచారంగా వస్తుందని విగ్రహారాధనలు చేస్తూ బయట వెతికే వారికి, ఎవరైతే సత్యమైన ‘ధ్యానమార్గాన్ని’ బోధిస్తారో వారే దేవతా స్వరూపులని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి తెలియచేస్తున్నారు.

అందుచేత ప్రతీ ఒక్కరూ దైవం వేరే ఎక్కడో లేడని తెలుసుకోవాలి. ‘ధ్యాన సాధన’ ద్వారా తామే దైవస్వరూపులన్న సత్యాన్ని గ్రహించాలి. ఇదే సత్యాన్ని అందరికీ బోధించాలి.

# "నిజమైన ఆరాధన"

శ్రీమత్ భాగవతం (29-21,22)


"నేను అన్ని జీవుల లోనూ సదా ఆత్మరూపంలో అవస్థితుడై ఉన్నాను. అలాంటి నన్ను విస్మరించి మర్త్యులు (మానవులు) నా ప్రతిమలకు అర్చనలు చేయ పూనుకుంటారు" |21|

ooo

"సర్వ జీవులలోనూ, ఆత్మ రూపంలో, ఈశ్వరుడిగా ఉన్న నా ఉనికిని గుర్తెరగక ఎవరు నన్ను ప్రతిమల ద్వారా పూజిస్తారో అలాంటివారి అర్చన బూడిదలో పోసిన యజ్ఞ ద్రవ్యాల లాగ నిష్ప్రయోజనం" |22|

ooo

## లాహిరి మహాశయులు



ప్రశ్న : శివుడు, విష్ణువు, కాళి ఈ దేవతలలో మీరు ఎవరిని ధ్యానిస్తారు?

జవాబు : శివుడిలో, విష్ణువులో, కాళి లో, నీలో, నాలో అందరిలో ఉండే వాడిని ధ్యానిస్తాను.

## స్వామి వివేకానంద



ఆరాధించదగిన ఒకే ఒక్క భగవంతుడు మానవ దేహంలో వున్న 'ఆత్మే'. మానవ దేహంలో కాకుండా ఎక్కడ ఆరాధించినా అది వ్యర్థమే.

ఏ క్షణంలో అయితే మానవ దేహమనే దేవాలయంలో భగవంతుని దర్శించగలుగుతామో, ప్రతి ఒక్కరిలో భగవంతుని చూడగలుగుతామో, ఆ క్షణంలో విముక్తులవుతాం.

# "దుఃఖ నివారణకు యోగుల సందేశం!"

ప్రస్తుతం మానవులు అనేక రకాల దుఃఖాలతో సతమతమవు తున్నారు. వాటి నుండి బయట పడటానికి అనేక ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. పూజలు, ప్రార్థనలు, నమాజులు చేస్తున్నారు, తీర్థయాత్రలు చేస్తున్నారు. గురువులను, స్వామీజీలను ఆశ్రయిస్తున్నారు. దేవుళ్ళను మారుస్తున్నారు. ఇంకా మతాలు కూడా మారుస్తున్నారు. కానీ ఎన్ని ప్రయత్నాలు చేసినా దుఃఖం నుండి బయటపడలేకపోతున్నారు.

కానీ మానవులు దుఃఖాన్నించి తాత్కాలికం గానే కాదు శాశ్వతంగా బయటపడే మార్గాన్ని ఎంతోమంది యోగులు బోధించారు. బోధిస్తున్నారు కూడా. వారంతా చేసిన బోధ, చూపించిన మార్గం ఒక్కటే. అదే 'ధ్యానం'. ధ్యానం ద్వారా ఎవరైనా దుఃఖం నుండి శాశ్వతంగా బయటపడవచ్చు. వారంతా ఏం చెప్పారో తెలుసుకుందాం.

**యోగి వేమన:-**



**"తనలో సర్వంబుండగ**
**తనలోపల వెదుక లేక ధర వెదకెడి ఈ**
**తనువుల మోసెడి యెద్దుల**
**మనముల దెల్పంగ వశమే మహిలో వేమ!"**

సమస్తం అంటే తనకు కావలసిన ఆరోగ్యం, శాంతి, ఆనందం, జ్ఞానం ఇంకా అన్నీ తనలోనే వుంటే మానవులు, తనలో వెతకకుండా బయట వెతుకు తున్నారు. బరువు మోస్తున్న ఎద్దుల వలె ఈ జీవితాన్ని భారంగా తయారు చేసుకుంటున్న ఈ మానవుల ఆలోచనలు, ఎవరైనా చెప్పగలరా? అని వేమన యోగీంద్రుల వారు చెపుతున్నారు.

**"యాత్రపోయి నాతడెన్నాళ్ళు తిరిగిన**
**భద్రమైన ముక్తి పదవి గనడు!**
**మనసు నిల్పునతడు మహనీయ మూర్తిరా...**
**విశ్వధాభిరామ వినురవేమ!"**

ఎన్నో వ్యయ, ప్రయాసలకు, కష్ట నష్టాల కోర్చి ఎన్ని యాత్రలు చేసినా, ఎన్నాళ్ళు తిరిగినా మానవుడు కోరుకునే దుఃఖాల నుండి బయట పడలేడు. కానీ ఎక్కడికీ వెళ్ళనవసరం లేకుండా మనసు నిల్పి ధ్యానం చేస్తే అంటే "శ్వాస మీద ధ్యాస" వుంచితే, వాడు సమస్త సమస్యల నుండి

తాత్కాలికంగానే కాదు శాశ్వతంగా బయటపడతాడు. యోగులులా మహనీయుడవుతాడని వేమన తెలియచేస్తున్నారు.

ΩΩΩ

మానవునకు అనారోగ్యం, అశాంతి, దుఃఖాల నుంచి ముక్తి కావాలి; కుటుంబ, ఆర్థిక సమస్యల నుంచి ముక్తి కావాలి. భయం నుండి, వార్ధక్య బాధల నుండి ముక్తి కావాలి. అసలు వీటన్నిటి నుండి శాశ్వతంగా విముక్తి లభించాలి. కానీ మానవుడు చేసే ప్రయత్నాల వల్ల శాశ్వతం మాట అటుంచి, తాత్కాలికంగానైనా బయట పడలేకపోతున్నాడు. దానికి కారణం వేమన యోగీంద్రులు ఈ పద్యం ద్వారా తెలియ చేసారు.

**"మనసులోని ముక్తి మరియొక్క చోటను**
**వెదుకబోవువాడు వెట్టివాడు!**
**గొట్టె జంకబెట్టి గొల్ల వెదకు రీతి**
**విశ్వదాభిరామ వినురవేమ!"**

మానవులు కోరుకునే సమస్త సమస్యల నుండి బయట పడే ముక్తి మార్గం, మనసులో వుండగా, వేరే వేరే ప్రదేశాలలో వెతికేవాడు వెట్టివాడు కాక మరేమవుతాడు. ఎవరైనా చంకలో గొట్టెపిల్లను పెట్టుకుని అన్ని చోట్ల వెతికే గొల్లవాడిలా ప్రవర్తిస్తారా. అలా ప్రవర్తిస్తే వాడు వెట్టివాడి క్రిందే లెఖ్ఖ అని వేమన యోగీంద్రులు చెపుతున్నారు.

**"మనసే మాయా మృగమౌ;**
**మనసేమిటి పైకి మరిపోనీక,**
**మనసును మనసున జంపిన**
**మనసందే ముక్తి మహిలో వేమా!"**


మాయామృగం సీతాదేవిని ఎలా కష్టాల పాలు చేసిందో మానవుల మనస్సు కూడా మానవులను రకరకాల కష్టాలకు గురి చేస్తుంది.

అలాంటి మనస్సును ప్రాపంచిక విషయాల మీదకు పోనీకుండా అంటే ఆలోచనలు లేకుండా చేసుకుంటే అంటే చంపితే (ఆలోచనలు వుంటే మనసు వున్నట్టు, ఆలోచనలు లేకపోతే మనస్సు శూన్యమైనట్టే కదా?) సమస్త దుఃఖాల నుండీ విముక్తి లభిస్తుందని వేమన యోగీంద్రులు చెపుతున్నారు.

**శృతి వాక్యం :-**

**“మనయేవ  మనుష్యాణాం కారణం బంధ మోక్షంః !! ”**

ΩΩΩ



మానవుల బంధం అంటే దుఃఖానికి, మోక్షం అంటే ఆనందానికి మనసే కారణమని శృతి వాక్యాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

మనసు లేని గాఢ నిద్రాస్థితిలో మనం ఎంతో ఆనందాన్ని పొందుతున్నాం. మెలకువలో మనస్సు వుంటుంది కాబట్టి, మెలకువ రాగానే దుఃఖాన్ని అనుభవిస్తున్నాం.  అందుచేత మనస్సు వుంటే దుఃఖం. మనస్సు లేకపోతే ఆనందం. మరి దుఃఖం నుండి బయటపడాలంటే. వేమన చెప్పినట్టు మనస్సును చంపాలి అంటే మనస్సు యొక్క ప్రాముఖ్యాన్ని పూర్తిగా తొలగించాలి. ఆ మార్గమే “శ్వాసమీద  ధ్యాస ధ్యానం”.

**యోగానంద పరమహంస :-**



“క్రియాయోగం ద్వారా అంతర్ నిశ్శబ్దాన్ని సాధిస్తే ముక్తి పొందవచ్చు”.


ΩΩΩ

క్రియ అంటే శ్వాసక్రియ, యోగం అంటే కలయిక. శ్వాసతో కలవడం అంటే ‘శ్వాస మీద ధ్యాస వుంచడం’ ద్వారా మనస్సు శూన్యం చేసుకొని  అంతర్ నిశ్శబ్దాన్ని అంటే ఆలోచనలు లేని స్థితి, మనస్సును చంపిన స్థితి పొందితే దుఃఖం నుంచి ముక్తి పొందవచ్చు.

**బ్రహ్మర్షి పత్రీజీ :-**

“ధ్యానం వల్ల జ్ఞానం, జ్ఞానం వల్ల ముక్తి”.

ΩΩΩ



ధ్యానం అంటే “శ్వాసమీద ధ్యాస వుంచడం” ద్వారా, ఆలోచనా రహిత స్థితి అంటే మనస్సు శూన్యమైన స్థితి పొందడం ద్వారా, విశ్వంలోని ప్రాణశక్తి ఆవాహం ద్వారా, నాడీమండల శుద్ధి జరగడం ద్వారా, దివ్య చక్షువు ఉత్తేజితం చేసుకోవడం ద్వారా,  జ్ఞానాన్ని పొంది కర్మలు దగ్ధం చేసుకోవడం ద్వారా, అనుభవించ వలసిన రోగాలు, అశాంతి, సమస్యలు, కష్టాలు లాంటి దుఃఖాల నుండి శాశ్వతంగా ముక్తి పొందవచ్చని బ్రహ్మర్షి పత్రీజీ బోధిస్తున్నారు.

**అవతార్‌మెహర్‌బాబా :**

"The Real Things that are given & received only in Silence"



ౚౚౚ

మానవునకు కావలసిన అసలైనవి అంటే శాంతి, ఆనందం, ధర్మం, ప్రేమ, కరుణ, జ్ఞానం అన్నీ నిశ్శబ్దంలోనే లభిస్తాయని మెహర్‌బాబా తెలియ చేశారు.

'నిశ్శబ్దం' అంటే 'అంతర్ నిశ్శబ్దం' అంటే మనసు లేని ధ్యాన స్థితిలో మానవులకు కావలసినవన్నీ లభిస్తాయి. ముఖ్యమైన ముక్తి కూడా లభిస్తుంది.

**ఆదిశంకరాచార్య :**



**సత్సంగత్వే నిస్సంగత్వం**
**నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలచిత్తం**
**నిశ్చలచిత్తే జీవన్ముక్తి!**

ౚౚౚ

చిత్తం అంటే మనస్సు నిశ్చలమైనపుడు ముక్తి లభిస్తుందని శంకరాచార్యుల వారి సందేశం. జీవన్ముక్తి అంటే జీవించి వుండగానే ముక్తి. వేటి నుండి అంటే అనారోగ్యం, అశాంతి, దుఃఖం, బాధలు, కష్టాల నుండి జీవించి వుండగానే ముక్తి పొందవచ్చు. అందుచేత "శ్వాస మీద ధ్యాస" వుంచడం ద్వారా చిత్తం అంటే మనస్సు నిశ్చలం చేసుకోవాలి.



**పతంజలి మహర్షి :**

**"యోగః చిత్తవృత్తి నిరోధః"**

ౚౚౚ

"చిత్తవృత్తులు నిరోధించడమే యోగం" అని పతంజలి మహర్షి తెలియచేశారు. అంటే యోగ స్థితి పొందాలంటే చిత్తంలోని వృత్తులు అంటే ఆలోచనలు నిరోధించాలి. అంటే మనస్సు శూన్యం చెయ్యాలి. దాని మార్గమే "శ్వాసమీద ధ్యాస". అలా యోగ స్థితి పొందితే వారు దుఃఖం నుండి బయటపడతారు

**శ్రీకృష్ణ పరమాత్మ :-**



**"యోగో భవతి దుఖః"**

ooo


యోగి అయిన వాడికి దుఃఖం వుండదు.

**"త్రైగుణ్యా విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జునా"**

ooo

"అర్జునా త్రిగుణాలకు అతీతమైన నిర్గుణిడివికా!" అన్నారు శ్రీ కృష్ణ పరమాత్మ. మనస్సు నిర్మలం చేసుకుంటే నిర్గుణి కావచ్చు. సత్వ, రజ, తమోగుణాలకు అతీతుడవ్వచ్చు. ఆ మార్గమే "శ్వాస మీద ధ్యాస ధ్యానం"

**శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి :-**



**స్నానమందు లేదు, పానమందు లేదు**
**మంత్రతంత్రములందు మహిమ లేదు**
**మనసు కుదిరెనేని ఘనయోగి తానౌను**
**కాళికాంబ హంసకాళికాంబ!**

ooo

నదీ స్నానాలు, సముద్ర స్నానాలలో ఏమీ లేదు, ఆలయాలలో తీసుకునే తీర్థం, గంగా తీర్థం పానం చేసినా ఫలితం ఉండదు. మంత్ర తంత్రాలలో కూడా ఏమీ లేదు. మనసును ధ్యానంలో నిర్గుణ స్థితికి చేర్చగలిగితేనే యోగి కాగలడు. దుఃఖం నుంచి బయట పడగలడు. అదే ముక్తి.

**రమణ మహర్షి :-**



**"మనస్సును ఆత్మలో లయం చెయ్యాలి"**

ooo

అంటే మనస్సు నిర్గుణ స్థితికి చేరితే ఆత్మలో లయమైనట్టే అదే ముక్త స్థితి. "శ్వాసమీద ధ్యాస" ద్వారా తేలికగా సాధించవచ్చు. దుఃఖం నుండి బయటపడవచ్చు.

**కల్కి భగవాన్ :-**



**"మనస్సు బందీలో వున్న ఇంద్రియాలను మనస్సు బందీ నుండి విడిపించడమే ముక్తి"**

ఎఎఎ

మానవుని జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు మనస్సు ఎలా చెప్తే అలా పనిచేస్తాయి. అందుచేత అవి మనస్సు బందీలో వున్నట్టే. అలా మనస్సు బందీలో ఇంద్రియాలు వుంటే మానవ జీవితం దుఃఖమయమవుతుంది. అందుచేత వాటిని మనస్సు యొక్క బంధం నుండి విడిపించాలి. మనస్సు ఉంటే ఇంద్రియాలు మనస్సు బందీలో వున్నట్లే. మనస్సును చంపితే ఇంద్రియాలకు స్వేచ్ఛ లభిస్తుంది. మానవునకు దుఃఖం నుండి విముక్తి లభిస్తుంది. మరి ఆ మనస్సును వేమన చెప్పినట్లు మనస్సు నందే చంపాలి.

మనస్సును నిర్వీర్యం చేసే మార్గమే 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం.

**సత్యసాయిబాబా :-**



**"దేహభావం వదిలితేనే దైవభావం కలుగుతుంది"**

ఎఎఎ

మానవునకు దేహభావం వున్నంత వరకు అన్ని రకాల దుఃఖాలు తప్పవు. దేహభావానికి కారణం మనస్సు. మనస్సును చంపితే వెంటనే దైవభావం కలుగుతుంది. దుఃఖం నుంచి విముక్తులవుతారు. ఆనందంగా వుంటారు. దాని మార్గమే "శ్వాసమీద ధ్యాస" ధ్యానం.



**జీసస్ క్రైస్ట్ :-**

"For Forty days and Forty nights he ate nothing!"

"నలభై రోజులు జీసస్ ఏమీ తినలేదు", అంటే మనసుతో తినకుండా అంటే ఆలోచించకుండా, చిత్తవృత్తులు నిరోధించి, అంతర్ నిశబ్దంతో 40 రోజుల ధ్యాన ముద్రలో ఉండి, దివ్యత్వాన్ని పొందారు. నిర్వికల్ప సమాధి పొందారు.

**గౌతమ బుద్ధుడు:-**



మానవుడు "నిర్వాణాన్ని" అంటే సమస్త దుఃఖాల నుండి శాశ్వతంగా బయట పడాలంటే "ఆనాపానసతి" ధ్యానం చెయ్యాలని బోధించారు. "ఆనాపానసతి' అంటే శ్వాస మీద ధ్యాస' ఉంచడం ద్వారా, చిత్త వృత్తి నిరోధం ద్వారా, విశ్వశక్తి ఆవాహం ద్వారా, కర్మ రహితం ద్వారా... దివ్యచక్షువు ఉత్తేజితం ద్వారా.... సమస్త దుఃఖాల నుండి బయట పడవచ్చు.

**బ్రహ్మర్షి పత్రీజీ:-**

"ఆధ్యాత్మిక శాస్త్ర విజ్ఞాన అనుభవ ప్రకారంగా ఒక గురువు చెప్పింది మరొక గురువు చెప్పిన దాని కన్నా విభిన్నంగా ఎప్పడూ వుండజాలదు. ఏ లోకంలోనైనా ఏ కాలంలోనైనా, "శాస్త్రజ్ఞానం" అన్నది ఒక్కటిగానే వుంటుంది. "ఏకం సత్"! అన్నారు కదా?".

ω ω ω

అందుచేత దుఃఖ నివారణకు యోగులందరూ చెప్పింది ఒక్కటేనని తెలుసుకోవాలి. వారంతా చూపింది ఒక్కటే మార్గం అదే "సత్యమార్గం" అని తెలుసుకుని "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తే తాత్కాలికంగానే కాదు, శాశ్వతంగా దుఃఖం నుంచి బయటపడవచ్చు.

యోగులు చెప్పిన పై విషయాలు గమనిస్తే మానవుని దుఃఖాలకు కారణం మనస్సులోనే వుందని తెలుస్తుంది. మనస్సు వుంటే దుఃఖం, మనస్సును జయించి శూన్యం చేసుకుంటే ముక్తి అని తెలుస్తుంది.

ఏది చేస్తామో అదే మన వెంట వస్తుంది;
ఏది చెయ్యకపోతే ఏదీ రాదు. - బ్రహ్మర్షి పత్రీజీ



# భగవంతునికి ఏమి సమర్పించాలి?

**శ్లో॥ పత్రం పుష్పం ఫలంతోయం, యోమే భక్త్యాప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుప్రహృతమశ్నామి ప్రయతాత్మనః (భ॥గీ॥ 9-26)**

తా:- ఎవడు నాకు భక్తితో ఆకును గాని, పుష్పమును గాని, పండును గాని, జలమును గాని సమర్పించుచున్నాడో అట్టి పరిశుద్ధాఃత కరణునిచే భక్తి పూర్వకముగా నొసంగబడిన ఆ పత్ర పుష్పాదులను నేను ప్రీతితో ఆరగించుచున్నాను.

చాలా మంది గీతలో గల పై శ్లోకాన్ని ఉదహరిస్తూ భగవంతుడు పత్రం, పుష్పం, ఫలం, జలం సమర్పించమన్నాడంటే పూజ చేయమనే కదా అర్థం. మేము పూజలో సమర్పించేవి అవే కదా? వాటితోనేగా మేము పూజ చేసేది. ఆయన ప్రీతితో కూడా స్వీకరిస్తానని తెలియచేశాడు. అందుచేత పూజ చేస్తున్నామని చెప్తుంటారు.

కాని గీతలో భగవంతుడు చెప్పిన వాటికి మనం సామాన్యమైన బాహ్యార్థం మాత్రమే తీసుకుంటున్నాం. కానీ దానిలోని అంతరార్థం తీసుకోవడం లేదు. భగవంతుడు చెప్పిన అంతరార్థం గ్రహించి ఆచరించిన వాడే భగవంతుని అనుగ్రహం పొంది ధన్యుడు కాగలడు. అంతే కాని తనకు నచ్చిన అర్థాన్ని తీసుకుని, తనకు నచ్చిన విధంగా ప్రవర్తిస్తే భగవంతుడు మెచ్చాలి కదా?

ఇక్కడ సమర్పించమన్నాడు కానీ, సమర్పించే వాటికంటే, సమర్పించే భావం ప్రధానమని గ్రహించాలి. అంటే సమర్పించే వాటి కంటే సమర్పించే వాడి భక్తి, చిత్తశుద్ధి రెండూ ప్రధానం. అంటే ఇచ్చే దానిని నిర్మల భక్తితో కోరికలు లేకుండా ఇవ్వాలి. ఇచ్చే వాని చిత్తం శుద్ధమై ఉండాలి. ఇవే ప్రధానం.

ఇంకా సమర్పించమన్నవి పత్రాలు, పుష్పాలు కాదు గంటలో వాడిపోయే వాటి వల్ల భగవంతునికి ఏమి ప్రయోజనం? భగవంతుడు కోరింది బాహ్యమైన పత్రాలు, పుష్పాలు, ఫలాలు, జలము కాదు. అంతరమైన మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం మాత్రమే వీటినే భగవంతుడు

సమర్పించమన్నాడు.

ఆకులు కదులుతుంటాయి. అలాగే మనస్సు కూడా చంచలంగా ఉంటుంది. అలా నిరంతరం చంచలంగా వుండే మనస్సు మనకు, ఇతరులకు, లోకానికి ఎంతో కీడు చేస్తుంది. "చంచలత్వం లేని నిశ్చల మనసు" వున్నవాడు, ఒకసారి ఒక మాట ఇంకొకసారి ఇంకొక మాట మాట్లాడడు. మాట నిలబెట్టుకుంటాడు. అలాంటివాడి వల్ల అందరికి మేలు జరుగుతుంది. అలాంటి చంచల మనస్సు సమర్పించమన్నాడు. అందుచేత మనస్సే పత్రం.

పూవు వికసిస్తుంది. పూవులా వికసించిన బుద్ధి వున్నవాడు లోకానికి ఉపకారం చేస్తాడు. అపకారం చెయ్యడు. అటువంటి బుద్ధిని సమర్పించమన్నాడు. అందుచేత బుద్ధియే పుష్పం.

నారికేళఫలం అంటే కొబ్బరికాయ. పగిలేది. జ్ఞానబోధ అనే దెబ్బలతో పగిలేది అహంకారం. అహంకార రహితులు జ్ఞానాన్ని పొంది భగవంతుని తత్వాన్ని ఆయన సత్యరూపాన్ని గ్రహించగలరు. అటువంటి అహంకార ఫలాన్ని సమర్పించమన్నాడు. అందుచేత అహంకారమే ఫలం.

జలం నిర్మలంగా వుంటుంది. అలాంటి నిర్మల చిత్తం ఏమీ కోరదు, దుఃఖాన్ని కలుగ చెయ్యదు. అటువంటి చిత్తాన్ని సమర్పించమన్నాడు. అందుచేత చిత్తమే తోయం.

అలాంటి "మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాలే, పత్రం, పుష్పం, ఫలం, తోయాలని" తెలుసుకోవాలి. వాటిని సమర్పించాలి. అవి ధ్యానం వల్లనే సాధ్యం. "శ్వాస మీద ధ్యాస" వుంచినపుడు మనస్సు యొక్క చంచలత్వం పోతుంది. అపుడు లభించే ప్రాణశక్తి వల్ల బుద్ధి వికసిస్తుంది. బుద్ధుడిలా మారతాడు. నేను అనే అహంకారం తొలగుతుంది. లోపల వున్న చెత్త ఆలోచనలన్నీ పోయి చిత్తం నిర్మలమవుతుంది. అటువంటి వారు పరిశుద్ధ మనస్కుడవుతాడు. లోకానికి మేలు చేస్తాడు. అందుచేత అవే భగవంతుడు కోరుకుంటాడు. అటువంటి వాడే ఆయనకు ప్రీతిపాత్రుడవుతాడు.

అంతేకాని పత్రాలను, పుష్పాలను, ఫలాలను, ఉదకాన్ని భక్తితో ఇచ్చినవారు ఎవరైనా వున్నారా? వాటిని దేవుడు ఆరగించినట్లు ఎవరైనా చూశారా? వివేకాన్ని ఉపయోగించక, యదార్థాన్ని గ్రహించలేక, ఆచారంగా వస్తుందని ఆచరిస్తున్నారు కానీ భగవద్గీత, ఉపనిషత్సారము గ్రహించి ధ్యానం ద్వారా నిజమైన పత్ర, పుష్ప, ఫల, తోయాలు సమర్పించి జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.



# "పూజ కాదు అంతర్‌శుద్ధి ముఖ్యం"!


మనిషి మనసు పరిశుద్ధమైతే తప్ప దేవాలయానికి రావడం వల్ల, శివుని పూజించడం వల్ల ఫలితం కలుగదు. పరిశుద్ధమైన మనస్సుతో చేసిన ప్రార్థనలకు శివుడు ప్రతిఫలమిస్తాడు. తాము అపవిత్రులుగా ఉండీ, ఇతరులకు ధర్మబోధ చేయడం వ్యర్థం. **అంతరింగక శుద్ధి లేకపోతే బాహ్యపూజ నిరర్థకం.**

కలియుగంలో జనులు తాము ఏమి చేసినా సరే, ఒక పుణ్యక్షేత్రానికి వెళితే, తమ పాపాలన్నీ పోతాయని నమ్మేంత అధోగతిలో పడిపోయారు. కల్మషహృదయంతో, దేవాలయంలో అడుగుపెట్టిన వాడి పాపాలు పెరిగి మరింత పాపి అవుతాడు.

తీర్థమంటే, పవిత్ర విషయాలతో, పవిత్ర పురుషులతో నిండి వున్న స్థలమని అర్థం. అయితే పవిత్ర జనులున్న స్థలంలో దేవాలయం లేకున్నా తీర్థమే అవుతుంది. నూరు దేవాలయాలున్న స్థలానికి దుష్టులు చేరితే అక్కడి పవిత్రత అదృశ్యమవుతుంది. **"తీర్థక్షేత్రంలో, చేసిన పాపాన్ని తొలగించుకోలేం".**

పరోపకారం చేయడమే పూజలన్నింటి సారం, దరిద్రునిలో, దీనునిలో, రోగిలో శివుణ్ణి చూడగలిగినవాడు నిజమైన శివారాధకుడు. విగ్రహంలో మాత్రమే శివుని చూసేవాని పూజ, ప్రారంభ దశలోనిదే. ఒక దరిద్రునిలో - వాని జాతి, మత, కులాన్ని చూడక - శివుణ్ణి చూసి, అతనికి సాయపడి, ఉపచారాలు చేస్తే వాడిపైనే, శివుని కెక్కువ ప్రీతి వుంటుంది; **తనను దేవాలయాల్లో మాత్రమే చూడగలిగే మనిషిపై దేవునికి ప్రీతి ఉండదు.**

- స్వామి వివేకానంద



# "పూజలు, వ్రతాలు, ఆరాధనలు ఆధ్యాత్మికం కాదు"!

భగవంతుని పూజించడం అంటే ఏమిటి? నాకు అది కావాలి! ఇది కావాలి! అని కోరడం కాదు. భగవంతుని మనం ఏ కోరికతోనూ ఆరాధించరాదు.

**దైవత్వం అనేది కేవలం పూజలు, వ్రతములు, ఆరాధనల వల్ల లభించేది కాదు. యోగములు, జపములు, తపములు - ఇవన్నీ సత్కర్మలు మాత్రమే. ఇది ఆధ్యాత్మికం కాదు. ఏది ఆధ్యాత్మికం? ఆత్మతో సంబంధమే నిజమైన ఆధ్మాత్మికం.** దానిని వదిలిపెట్టి, తాత్కాలికమైన జపములు, యోగములు చేస్తూంటే తాత్కాలిక ఫలితాలనిస్తుంటాయి. 'ఆత్మ' ఒక్కటే సత్యమైనది, నిత్యమైనది. అట్టి సత్యమైన, నిత్యమైన ఆత్మను "ధ్యానించినప్పడే సత్యమైన, శాశ్వతమైన ఫలితాలు చేకూరుతాయి".

**ఈనాడు భజనలు చేస్తున్నారు. ఎన్నో ట్యూన్లు మారుస్తున్నారు. కాని భావాన్నేమైనా మార్చుకుంటున్నారా? భావం మారని భజనలు ఎందుకోసం?** లోపల చూస్తే పశుగుణాలు, మృగగుణాలు, దుష్టభావాలు కాని బయట చూస్తే నామస్మరణలు. లోపలిభావాలు ఏ మాత్రం మారడం లేదు. భావం మారినప్పడే భజనలు చేసినందులకు సార్ధకత.

మనుష్యులు మారితే ప్రయోజనం లేదు, మనసులు మారాలి. మనసులు మారినప్పడే 'మానవత్వం' అనేది మనలో ఆవిర్భవిస్తుంది. మనం చేస్తున్న భజనలు కేవలం బాహ్యామైనటువంటి రాగ, తాళ, భావములతో కూడుకొని ఉంటున్నాయే కాని నిజమైనటువంటి హృదయంలోనికి చేరడం లేదు. ఈ విధమైన భజనలు ఎన్ని సంవత్సరాలు చేసినప్పటికిని అది టేపు రికార్డు మాదిరిగానే వుంటుంది.

హృదయంలో మార్పు రావాలి. హృదయం పవిత్రమైన భావాలతో నిండాలి. దుష్టభావాలు, దుష్ట చింతనలను లోనికి రానీయకూడదు.

పవిత్రమైన భావాలకే అవకాశం ఇవ్వాలి. కనుక భజనలు చేసేటటువంటి వారు భావాలను మార్చుకోండి. **భావాలు మార్చుకోకుండా కేవలం భజనలు చేస్తూ పోతే అంతా కృత్రిమంగానే కనిపిస్తూ ఉంటుంది.**

భగవంతుడు ప్రేమకు మాత్రమే వశుడవుతాడు. అట్టి ప్రేమ లేకుండా ఎన్ని దానాలు చేసినా ఏమి ప్రయోజనం? ఎన్ని పూజలు చేసినా ఏమి ప్రయోజనం? **"దేవుని పూజించటం, జీవుల్ని హింసించటం ఇది భక్తి కానేరదు".** అన్నింటికి 'ప్రేమే ప్రాణం' కనుక ఆ ప్రాణ స్వరూపమైన ప్రేమను మనం పెంచుకోవాలి.

ఎవరిని దూషించినా భగవంతుని దూషించినట్లేనని భావించాలి. ఇదియే నిజమైనటువంటి సాధుత్వం. సాధువులు అంటే కాషాయ వస్త్రాలు ధరించిన వారా? కాదు....కాదు......

సాధుత్వం కలిగిన వారే సాధువులు. పవిత్రమైన హృదయం కలిగినటువంటి వారే సాధువులు. గుడ్డలు మార్చుకున్నంత మాత్రాన చాలదు. గుణాలు మార్చుకోవాలి. ఎవరిని ప్రేమించినా భగవంతుని ప్రేమించినట్లేనని భావించాలి. అదే నిజమైనటువంటి సాధుత్వం.

**ఆనందం ఇవ్వగలవాడు ఒక్క దైవం మాత్రమే. అట్టి దైవము నీలో వున్నా కూడా గుర్తించలేక పోతున్నావు.** దైవం సర్వత్రా వున్నాడు. ఎక్కడ చూసినా వున్నాడు. భగవంతుడు లేని స్థానం లేదు. అందుకే "Body is the Temple of God" అన్నారు. దైవమే దేహాన్ని నడిపేటటువంటి డ్రైవరు. అట్టి దైవాన్ని విస్మరించి దేహమే ప్రధానమని భావించితే నీవు ఎక్కడికి పోగలవు?

మీ వెంట, జంట, ఇంట, కంట ఉండి కాపాడేది దైవం ఒక్కడే. కాపాడేది బంధువులు కాదు. వారు రాబందులు. ఉన్నంత వరకు పీక్కుతింటారు. కాని దైవం అట్లా కాదు. ఎల్లప్పడూ నీలో, నీ వెంట ఉంటూ, నిన్ను కాపాడుతూనే వుంటాడు.

పశువులు పంటను చూస్తే చాలు అక్కడికి వెళ్ళి తింటాయి. ఇంటికి పోయిన తరువాత నమిలి నెమరువేసి జీర్ణించుకుంటాయి. అదే విధంగా అవకాశం వచ్చినప్పడల్లా 'పవిత్రమైన విషయాలను' మొదట వినాలి. ఆ తరువాత ఇంటికి వెళ్ళి, విన్న విషయాలను మననం చేసుకోవాలి. తదుపరి ఆచరణలో పెట్టాలి. ఆచరణ చాలా అత్యవసరం.

- శ్రీ సత్యసాయిబాబావారు (ది.28.8.1997)



# "నవ విధ భక్తులు!"

ఈ క్రింది వాటిని నవ విధ భక్తులుగా పేర్కొన్నారు. అవి 1.శ్రవణం, 2.మననం, 3.కీర్తనం, 4.పాద సేవనం, 5.అర్చనం, 6.వందనం, 7.దాస్యం, 8.సఖ్యం, 9.ఆత్మ నివేదన.

పై వాటిలో అత్యంత ముఖ్యమైనది భగవంతునికి ప్రీతికరమైనది ఆఖరిదైన 'ఆత్మ నివేదన'. ఆత్మ నివేదన అంటే 'తనని తాను సమర్పించు కోవడం'. ఆత్మ నివేదనే భగవంతుని తృప్తి పరచేది. మిగిలిన 8 రకాల భక్తులు కూడా ఆఖరిదైన ఆత్మ నివేదనకు మార్గాన్ని చూపే ప్రాథమికమైన చర్యలే. అవి చేసే వాడిని మాత్రమే తృప్తి పరుస్తాయి.

గమనిస్తే మొదటి 8 రకాల భక్తులలో ఏదో ఒకటి చెయ్యడం కనిపిస్తుంది. కానీ అసలు ఏమీ చెయ్యకపోవడమే ఆత్మ నివేదన. అదే షిరిడీ బాబా కోరుకున్నారు. ఆయన ఆలయాలలో జరిగే కార్యక్రమాల అంతరార్థం కూడా ఇదే.

గమనిస్తే షిరిడీ బాబా ఆలయానికి వెళ్ళినపుడు మొట్టమొదట ధునిలో కొన్ని సమిధలు వేసి దగ్ధం చేస్తాం. ఆ తరువాత ఆయన విగ్రహ దర్శనం చేసుకుంటాం. దర్శనానంతరం, విభూతి ఇవ్వబడుతుంది. ఆ విభూదిని ధరిస్తాం. ఇది బాహ్యంగా మనకు కనబడే చర్యలు. కానీ వీటన్నిటికీ అంతరార్థం వుంది. ఈ చర్యల వల్ల మనకు బాబా విగ్రహ దర్శనం, మామూలు విభూతి మాత్రమే లభిస్తుంది.

కానీ వీటి అంతరార్థం గ్రహించి ఆచరించిన వారికి బాబా అంటే భగవంతుని నిజ దర్శనం కలగడమే కాకుండా నిజమైన విభూతి జీవితంలో లభిస్తుంది. అందుకే బాబా ఆత్మ నివేదన కోరుకున్నారు.

ఆత్మ నివేదన అంటే తెలుసుకుందాం. పూలు, ఫలాలు లాంటివి ఏవి నివేదించినా, అవి ఆత్మ నివేదన క్రిందకు రాదు. అలాగే కళ్ళు మూసుకుని బాహ్యాన్ని వదిలినా, మనస్సులో ఈ బాహ్య విషయాలే మెదులుతూ వుంటాయి. ఇల్లు, భార్య, భర్త, పిల్లలు, సంపాదన, ధనం,

పదవులు, భోగభాగ్యాలు, సమస్యలు, కోరికలు లాంటివి ఏవి మనస్సులో వున్నా వాటిని మాత్రమే నివేదించినట్లవుతుంది కానీ, ఆత్మను నివేదించినట్లు అవ్వదు.

ఆత్మను నివేదించాలంటే మనసులో ఏమీ వుండకూడదు. ముఖ్యంగా మనసు గుణాలైన తమోగుణం, రజోగుణం, సాత్వికగుణాలను దగ్ధం చెయ్యాలి.

ధ్యానం ద్వారా వాటిని దగ్ధం చేయాలంటే ముందు మనసును నిశ్చలం చేసుకోవాలి. తరువాత నిర్మలం చేసుకోవాలి. ఆ తరువాత మనస్సు శూన్యమవుతుంది. అప్పుడు ఇక వుండేది ఆత్మే. అలాంటి స్థితిలో, వున్నది ఆత్మే కాబట్టి ఆత్మనే నివేదించినట్లవుతుంది. అదే ఆత్మ సాక్షాత్కారం, భగవత్ సాక్షాత్కారం అంటారు. అలా భగవంతుని నిజసాక్షాత్కారం పొందిన వానికి నిజమైన విభూతి లభిస్తుంది.

భూతి అంటే ఆనందం, విభూతి అంటే విశేషమైన ఆనందం. అలా భగవంతుని నిజదర్శనం చేసుకున్న వారికి సమస్త దుఃఖాలు నశించి జీవితంలో విశేషమైన ఆనందం లభిస్తుంది. వారినే జీవన్ముక్తులు అంటారు. అంటే జీవించి ఉండగానే సమస్త దుఃఖాల నుండి ముక్తి పొందినవారు.

పరమశివుడిని విభూతి ధారి అంటారు. కారణం ఆయన ఎప్పుడూ ఆనందంలో వుంటాడు కాబట్టి.

అంతేకాని విభూతి పూసుకున్నవాడు విభూతిదారి కాడు. విశేషమైన ఆనందంలో వున్నవాడే నిజమైన విభూతి ధారి. అందుచేత బాబా కోరిన ఆత్మ నివేదన చేసి విభూతిని అంటే విశేషమైన ఆనందాన్ని పొందుదాం. విభూతిధారులు అవుదాం. ధ్యానం చేద్దాం. షిరిడీ బాబా ఆలయాలలో ధ్యాన మందిరాలు వుండటానికి కారణం ఇదే.

దగ్ధం చెయ్యవలసింది ధునిలో సమిధలను కాదు. ధునిలో సమిధలు దగ్ధం చేస్తే విగ్రహదర్శనం మాత్రమే కలుగుతుంది. మామూలు విభూతి లభిస్తుంది. కానీ "ధ్యాన ధుని"లో గుణాలు దగ్ధం చేసి ఆత్మ నివేదన చేస్తే, బాబా అంటే భగవంతుని నిజదర్శనం లభిస్తుంది. నిజమైన విభూతి అంటే విశేషమైన ఆనందం లభిస్తుంది.


ఎందుచేతనంటే మన గుణాలు తొలగితేనే భగవంతునికి ఆనందం. కారణం స్వార్థగుణాలు లేని వాడు లోకానికి ఉపకారం చేస్తాడు. స్వార్థగుణాలు ఉన్నవాడు లోకానికి అపకారం చేస్తాడు. షిరిడీ బాబా కోరుకునేది మన వల్ల లోకానికి ఉపకారం జరగాలనే. ఆయన ఎప్పడూ అందరికీ ఎన్నో రకాలుగా ఉపకారం చేసేవారు. మనం కూడా అలా చెయ్యాలనే ఆయన కోరిక. అందరిలోను, సమస్త జీవుల్లోనూ ఆయనను చూడాలన్నదే ఆయన కోరిక. అదే ఆయనకు ఆనందం.

ఇదే భగవద్గీతలో శ్రీ కృష్ణభగవానుడు బోధించింది కూడా!

**"త్రైగుణ్య విషయా వేదా! నిస్త్రైగుణ్యో భవార్జున!** (భ.గీ.2-45)

తా:- అర్జునా త్రిగుణాలకు అతీతమైన నిర్గుణివి అవ్వు.

అందుచేత ధ్యానం చేసి గుణాలు తొలగించుకుని నిర్గుణులై బాబా కోరుకున్న ఆత్మ నివేదన చేద్దాం.



**పూజ మెట్టు కాదు అగడ్త**

**- దయానంద సరస్వతి**

# "భగవంతునికి సమర్పించవలసిన పుష్పాలు!"

సాధారణంగా అందరూ పూజ ద్వారా భగవంతునికి పుష్పాలు, ఫలాలు సమర్పిస్తారు. కానీ భగవంతునికి పూజ ద్వారానే కాదు, ఏ విధంగానైనా సమర్పించవచ్చు. కారణం భగవంతుడు సర్వాంతర్యామి, ఆయన అంతటా వున్నాడు. అన్నింటిలోను వున్నాడు. ఒక్క విగ్రహంలోనే కాదు. లోకమంతా ఆయనే. అన్ని రూపాలు ఆయనవే.

లోకంలో ఎవరికి ఏమి సమర్పించినా ఆయనకు సమర్పించినట్టే. ఒక రకంగా విగ్రహానికి సమర్పించే వాటి కంటే లోకానికి సమర్పించినవే ఆయనకు చెందుతాయి. కారణం విగ్రహానికి సమర్పించినవన్నీ సమర్పించిన వాడే తీసుకుంటాడు. అందుచేత అది భగవంతునికి ఇచ్చినట్టు కాదు. కాని లోకానికి ఇచ్చేదే భగవంతునికి ఇచ్చినట్టు.

విగ్రహానికి సమర్పించిన పుష్పాలు ఒక గంటలో వాడిపోతాయి. గంటలో వాడిపోయే పుష్పాలు భగవంతుడేమి చేసుకుంటాడు? అదీ కాక ఈ భూమండలం మీద వున్న సమస్తమూ ఆయనవే. ఆయన సృష్టే. ఆయనవి, ఆయనకివ్వడంలో గొప్పతనం ఏముంది? అవి ఆయనకు ఆనందాన్ని కలిగించవు. మన స్వంతానివి ఇవ్వాలి. అవి విగ్రహానికి కాదు. ఆయనకు చెందేట్లుగా ఇవ్వాలి. అవి ఆయనకు ఆనందాన్ని కలిగించేవిగా వుండాలి. అలాంటి పుష్పాలు సమర్పించాలి. అప్పడే భగవంతుడు ఆనందిస్తాడు. మనల్ని అనుగ్రహిస్తాడు.

భగవంతునికి ఆనందం కలిగించే పుష్పాలు వాడిపోయే పనికి రానివి కాదు. వాడిపోని లోక కళ్యాణకరమైన "సుగుణాలనే పుష్పాలు". అటువంటి సుగుణాలనే పుష్పాలు సమర్పించాలి. అంటే మంచి గుణాలు కలిగి వుండి, వాటి ద్వారా లోకానికి ఉపకారం చెయ్యాలి. కారణం లోకమే భగవంతుడు కాబట్టి; లోకానికి కలిగించే ఆనందం భగవంతునికి కలిగించినట్టే. అవి భగవంతునికి సమర్పించినట్టే. అందుచేత గుణాలనే పుష్పాలే భగవంతునికి ఇష్టమైనవి.

దేవునికి ఇష్టమైన 8 పుష్పాలు

1) అహింస, 2) ఇంద్రియ నిగ్రహం, 3) సర్వభూత దయ, 4) ధర్మం, 5) ప్రేమ, 6)శాంతి, 7)ధ్యానం, 8) సత్యం.

1) అహింసా పుష్పం :- దేవుని ఆరాధించాలంటే ప్రప్రథమంగా అహింసా

పుష్పాన్ని సమర్పించాలి. దేవునికి ఇష్టమైన మొదటి పుష్పం ఇదే. అంటే ఎవరిని హింసించ కూడదు. ఏ జీవిని, ప్రాణిని చంపకూడదు. మాంస భక్షణ చేయకూడదు.

2) ఇంద్రియ నిగ్రహ పుష్పం :- అలాగే ఇంద్రియ నిగ్రహం అంటే ఇంద్రియాల మీద అదుపు కలిగి ఉండాలి. అలా వుంటే చేయకూడని పనులు చెయ్యం. లోకానికి చెడు జరగదు.

3) సర్వభూత దయా పుష్పం :- అన్ని ప్రాణుల పట్ల దయ, కరుణ కలిగి ఉండాలి. అప్పడు దేవుడ్ని మనమీద దయ చూపించమని కోరనక్కర లేదు. మన క్రింది వారి మీద మనం దయ చూపిస్తే, ఆ పై వాడు మన మీద దయ చూపిస్తాడు.

4) ధర్మ పుష్పం :- అంతరాత్మ రూపంలో భగవంతుడు చెప్పే ధర్మాలు ఆచరించాలి. అంటే అంతరాత్మ ప్రబోధం వినాలి. అంటే భగవంతుడు చెప్పినట్టు వినాలి.

5) ప్రేమ పుష్పం :- తనను తాను ఎలా ప్రేమించుకుంటున్నాడో అందరినీ అంటే మానవులనే కాదు అన్ని జంతువులను అలాగే ప్రేమించాలి.

6) శాంతి పుష్పం :- శాంతిని పంచాలి, అంటే లోకంలో వున్న వాటిని శాంతిగా జీవించనివ్వాలి. సుఖంగా ఉండనివ్వాలి. మన వల్ల ఎవరికి, ఏ ప్రాణికి నష్టం జరగకూడదు. ఏ కష్టం కలగకూడదు. అప్పడే అన్నీ సుఖంగా, శాంతిగా వుంటాయి. అంతే కాని "లోకా సమస్తా సుఖినో భవన్తు" "ఓం శాంతిః శాంతిః శాంతిః" అంటే సరిపోదు.

7) ధ్యాన పుష్పం :- పై గుణాలన్నీ కలిగి వుండాలన్నా, ఆచరించ గలగాలన్నా ధ్యానం చెయ్యాలి. ధ్యాన పుష్పంతో అన్ని రకాల పుష్పాలు సంపాదించుకోగలం. దేవునికి సమర్పించగలం.

8) సత్య పుష్పం :- పై పుష్పాలన్ని కలిగి వున్నవాడు సత్యంలో జీవిస్తాడు. సత్యాన్ని తెలుసుకుంటాడు. సత్యాన్ని ఆశ్రయిస్తాడు. జ్ఞానాన్ని పొందుతాడు. అందుచేత అతి ముఖ్యమైన ఈ అష్ట పుష్పాలను భగవంతునికి సమర్పించాలి. ఈ పుష్పాల ను భగవంతుడు అత్యంత ప్రీతితో స్వీకరిస్తాడు. స్వీకరించడమే కాదు. అనుగ్రహిస్తాడు కూడా.

> అందరి మౌలిక శక్తి సామర్థ్యాలు అంతులేనివని
> అర్థం చేసుకోవాలి. - బ్రహ్మర్షి పత్రీజీ

# "పూజ కాదు - సేవ ముఖ్యం!"

భారతదేశంలో తరతరాల నుండి పూజకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది. ఎక్కువ మంది పూజకే ప్రాముఖ్యం ఇస్తారు.

అలా పూజలు చేస్తూ మిగిలిన విషయాలకు ప్రాముఖ్యం ఇవ్వరు. అంటే ప్రవర్తన, నడవడిక, గుణాలకు ఎటువంటి ప్రాముఖ్యం ఇవ్వరు. అలా పూజలు చేస్తే చాలు ఏమైనా చేసుకోవచ్చు. ఎలాగైనా ప్రవర్తించవచ్చని భావిస్తారు. పాపాలు కూడా చేసుకోవచ్చ నుకుంటారు.

సహజంగా పాపాలు చెయ్యటానికి భయ పడాలి. కారణం పాపాల వల్ల జీవితంలో భరించలేని రోగాలు, దుఃఖం కలుగుతాయి. కానీ మానవులు పాపాలు చెయ్యటానికి భయపడరు. పూజ మానటానికి భయపడతారు. పూజ చెయ్యకపోతే ఏమవుతుందోనని విపరీతంగా భయపడతారు. పూజ చేస్తే ఏమి చెయ్యటానికైనా వెనుకాడరు. ధైర్యంగా పాపాలు చేస్తారు. ఆ పూజైనా శ్రద్ధగా చేస్తారా? అంటే అదీ వుండదు.

కానీ ఆలోచిస్తే పూజకు పెద్ద ప్రాముఖ్యం లేదని తెలుస్తుంది. కబీరు "పూజ కాదు సేవ ముఖ్యం" అని చెప్పారు. చిన్న ఉదాహరణ తీసుకుందాం. వృద్ధ దంపతులకు ఇద్దరు కొడుకులున్నారు. వారిలో ఒకడు ప్రతీ రోజు తల్లిదండ్రులకు పూజ చేస్తాడు కానీ తరువాత వారిని ఏ మాత్రం పట్టించుకోడు. రెండవ వాడు వారికి పూజ చేయడు కానీ, రోజంతా వారికి సేవ చేస్తాడు. వారికి కావలిసినవన్నీ చూస్తాడు. ఆ వృద్ధ తల్లిదండ్రులకు మొదటివాడి పూజ కన్నా, రెండవ వాడి సేవే ఆనందం కలిగిస్తుంది. కారణం పూజ వల్ల వారికి కలిగే ప్రయోజనం ఏదీ వుండదు. అవసానదశలో వారికి చేసే సేవలే వారికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. వారి పనులు వారు చేసుకోలేని స్థితిలో వున్నపుడు, లేచినప్పటి నుండి పడుకునే వరకు వారికి కావలసిన అవసరాలన్నీ తీర్చే కొడుకును చూసి వారు పొందే ఆనందానికి అవధులు వుండవు. అలా చెయ్యగలిగిన రెండవ వాడే వారికి ఆనందాన్ని కలిగించినవాడవుతాడు.

అలాగే గోవును పూజిస్తాం. కానీ పూజ వల్ల గోవుకు కలిగే ప్రయోజనం ఏమీ వుండదు. దాని బదులు దానికి శ్రద్ధగా సేవ చేస్తే, అంటే సమయానికి ఆహారం, నీరు ఇస్తూ, దాన్ని మృదువుగా నిమురుతూ, అది వున్న ప్రదేశాన్ని పరిశుభ్రంగా వుంచుతూ, సమయానికి ఏది కావాలో అది సమకూర్చితే అది ఎంతో ఆనందిస్తుంది. అంతే కాని పూజ వల్ల

దానికి  ఏ ప్రయోజనం వుండదు.

అలాగే తులసి మొక్కను పూజిస్తాం. కానీ మనం చేసే పూజ కంటే, చేసే సేవే ఆ మొక్కకు ఎక్కువ ప్రయోజనం. ఆ మ్రొక్కను త్రుంచ కుండా, సరిగా నీరు పోస్తూ పోషిస్తే ఆ మొక్క నిజంగానే ఆనందిస్తుంది. అంతేకాని పూజ వల్ల ఆ మొక్కకు కలిగే ప్రయోజనం ఏమి ఉంటుంది ?

పై వాటిని గమనిస్తే, పూజ కంటే సేవే అందరికి ఆనందాన్ని ఇస్తుందని గ్రహించవచ్చు. మానవులైన మనమే పూజకంటే సేవకు ప్రాముఖ్యం ఇస్తుంటే అనంత శక్తి స్వరూపుడైన భగవంతుడు పూజకు ప్రాముఖ్యం ఇస్తాడా? అందుచేత భగవంతుడు కూడా సేవకే ప్రాముఖ్యం ఇస్తాడు. మరి భగవంతుని సేవ ఎలా చేస్తాం? లోకానికి చేసే సేవే భగవంతునికి చేసే సేవ. ఎందుచేతనంటే లోకమే భగవంతుడు కనుక. లోకంలో భగవంతుడు కానిది, లేనిది అంటూ ఏదీ లేదు కనుక. అందరూ ఆయన బిడ్డలే కనుక. అందుచేత లోకానికి కలిగే మేలు భగవంతునికి కలిగినట్టే. లోకులకు కలిగే ఆనందం భగవంతునికి కలిగినట్లే. అందుచేత అందరిలో భగవంతుని దర్శిస్తూ అందరికీ సేవ చేస్తూ, అందరినీ ఆనందింప చేస్తే, భగవంతునికి ఆనందం కలిగించిన వారమవుతాం. అందుచేత "పూజ వల్ల భగవంతునికి ఆనందం కలగదు. లోకానికి చేసే సేవ వల్లే భగవంతునికి ఆనందం కలుగుతుందని తెలుసుకోవాలి".

అందుకే సత్యసాయిబాబా వారు అందరినీ ప్రేమిస్తూ, అందరికీ సేవ చెయ్యమంటారు. అదే ఆయనకు ఆనందమంటారు. ఏ దేవుడైనా ఇదే చెపుతున్నారు. ఇదే చెయ్యమంటారు. అందుచేత 'పూజ కాదు సేవే ముఖ్యమని' తెలుసుకోవాలి. సేవ చెయ్యటానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. సాటి మానవులకు, సాటి జీవులకు సేవ చెయ్యాలి. భగవత్ స్వరూపంగా భావించి సేవ చెయ్యాలి. సాటి జీవులను, ప్రాణులను హింసించ కూడదు. మాంస భక్షణ చెయ్యకూడదు.

అలా అందరిలో భగవంతుని చూడాలన్నా, అందరిని సమానంగా భావించాలన్నా, అందరికీ సేవ చేయగలగాలన్నా భగవంతుని ఆనందింప చెయ్యాలన్నా, ఒక్కటే మార్గం. అదే "శ్వాస మీద ధ్యాస ధ్యానం". ధ్యానం ద్వారానే ఈ సత్యాన్ని తెలుసుకోగలం. అందరికీ సేవ చెయ్యగలం.

తలలు కాదు బోడులు - తలపులు కావాలి బోడులు!

- బ్రహ్మర్షి పత్రీజీ

# భగవంతునికి ఎందుకు నమస్కరించాలి?

భగవంతునికి ఎందుకు నమస్కరించాలి? అని అడిగితే ఆయన గొప్పవాడు కాబట్టి అని కొందరు, కోరికలు తీరుస్తాడని కొందరు, కష్టాలు లేకుండా చేస్తాడని కొందరు, పాపాలు క్షమిస్తాడని కొందరు, ఇలా రకరకాలుగా చెప్తూంటారు. ఇంకా కొందరు మంచి చేస్తాడని, అనుగ్రహిస్తాడని కూడా కారణాలు చెప్తూంటారు. అలా రకరకాలుగా చెప్తూంటారు. కానీ అంతకన్నా ఆలోచించరు. భగవంతునికి నమస్కరించాలి. కాని ఎందుకు? తెలుసుకుందాం.

కోరికలు తీరుస్తాడని నమస్కరిస్తాం. కానీ భగవంతుడు కోరింది ఇవ్వడు. అర్హతని బట్టి ఇస్తాడు. కోరిందల్లా ఇచ్చేటట్ల యితే అందరికీ అన్నీ వుండాలి. మరి ఎందుకు లేవు? కోరడం పెద్ద కష్టమైన పనా? అర్హత సంపాదించుకోవడమే కష్టం. అందు చేత నమస్కరించ వలసింది కోరికల కోసం కాదు.

అంతే కాదు ఆయన కష్టాలు కూడా తొలగించడు. కష్టాలు తొలగించుకునే మార్గాన్ని చూపిస్తాడు. ఆయన పాపాలు కూడా క్షమించడు. పాపాలకు శిక్షలు వేసి, పాపాలు చేయకుండా వుండే శిక్షణ ఇస్తాడు. అందుచేత వాటి కోసం నమస్కరించవలసిన పని లేదు.

మంచి చేస్తాడని చెప్తూంటారు. ఆయన మనకే కాదు మనం నమస్కరించినా, నమస్క రించకపోయినా అందరికీ మంచి చెయ్యాలనే చూస్తాడు. అంతేకాదు ఆయన ఏది చేసినా మన మంచికే అని ఆలోచిస్తే తెలుస్తుంది. ఆయన ఎవరికి చెడు చెయ్యడు. ఏది చేసినా మంచే. ఆయన సృష్టిలో అంతా మంచే వుంది. ఏదైనా చెడు కనబడుతుందంటే అది బయటది కాదు మనలోనిదే. మనలోని దోషమే మనకు బయట కనిపిస్తుంది.

అలాగే నమస్కరించకపోతే ఆగ్రహిస్తాడేమోననుకుంటారు. ఆయనకు ఎవరి మీద ఆగ్రహం ఉండదు. అనుగ్రహం వుండదు. ఎందు చేతనంటే ఆయన రాగ, ద్వేషాలు లేనివాడు. నిర్గుణుడు ఆయ నకు అంతా సమానం, అంతా ఒక్కటే. పూజ చేసిన వారిని ఒక రకంగానూ పూజ చేయని వారిని మరో రకంగానూ చూడడు. ఆయనకు ప్రత్యేకించి ఎవరి మీద అనురాగము ఉండదు. ద్వేషము ఉండదు. అందుచేత ఆయన ఆగ్రహానుగ్రహాల కోసం నమస్కరించవలసిన పని లేదు.

అలాగే ఆయన ఏదో ఇస్తాడని, కాపాడతాడని, ఉపకారం చేస్తాడని

నమస్కారం చేస్తున్నాం కాని భగవంతునికి మనం నమస్కరించవలసింది ఇస్తాడని కాదు - ఇచ్చాడని, కాపాడతాడని కాదు, కాపాడుతున్నందుకు, "ఉపకారం చేస్తాడని కాదు - ఉపకారం చేస్తున్నందుకు".

భగవంతుడు మనకు ఇచ్చింది గుర్తించ లేకపోతున్నాం. ఇచ్చిన వాటి విలువ తెలుసుకుంటే, ఎప్పడో గుర్తు వచ్చినపుడు ఫోటో కనబడిన పుడు మాత్రమే నమస్కరించుకోం, అనుక్షణం భగవంతుని గుర్తుంచు కుంటాం. నమస్కరించు కుంటాం. కృతజ్ఞతలు తెలుపు కుంటాం. ఇవ్వమ ని కోరం, ఇవ్వలేదని దుఃఖించం, ఫోటోలు మార్చం, మతాలు మార్చం.

ఇంకా మనకు ఈ అద్భుతమైన మానవ జన్మ ఇచ్చినందుకు నమస్కరించాలి. ఏ ప్రాణికి ఇవ్వని అవకాశం మన కు ఇచ్చినందుకు నమస్కరించాలి. అద్భుతమైన ఇంద్రియాలను, వాటితో జీవితాంతం పని చెయ్య గలిగే శక్తిని, సృష్టిలోని భోగాలను అను భవించి ఆనందించగలిగే అవకాశం ఇచ్చినందుకు నమస్కరించాలి.

'జన్మ లేకుండా చేసుకునేందుకు కావలసిన జన్మనిచ్చినందుకు నమస్కరించాలి. ఇది 84 లక్షల జీవులలో ఎవరికి లేదు. ఒక్క మానవునికే వుంది. అలాగే ఏ జీవికి లేని తెలివి ఇచ్చినందుకు నమస్కరించాలి.

లోకానికి సేవ చెయ్యగలిగే అవకాశం ఇచ్చినందుకు' నమస్కరిం చాలి. అందరికీ మేలు చెయ్యగలిగే శక్తిని ఇచ్చినందుకు నమస్కరించాలి. ప్రకృతి ద్వారా, ప్రకృతిలో జరిగే సంఘటనల ద్వారా, ప్రకృతిలో వున్న జీవుల ద్వారా జీవిత పాఠాలు నేర్చుకునే అవకాశం కల్పించినందుకు నమస్క రించుకోవాలి. అంతరాత్మ రూపంలో మన ధర్మాలను తెలియ చేస్తున్నం దుకు నమస్కరించుకోవాలి. ఆయన శక్తితో అనుక్షణం శరీరంలో సుమారు 200 క్రియలు అంటే శ్వాసక్రియ, జీర్ణక్రియలు లాంటివి జరిపిస్తూ, జీవితాంతం ఆరోగ్యంగా ఉండే అవకాశం కల్పించినందుకు నమస్కరించుకోవాలి.

అన్నిటిని సంపాదించుకునే శక్తి ఇచ్చినందుకు నమస్కరించు కోవాలి. ఇంకా చూసే శక్తి, వినే శక్తి, మాట్లాడే శక్తి, పని చేసే శక్తి, నడిచే శక్తి, ఆలోచించే శక్తి, ఇంకా అనేక శక్తులు ఇచ్చినందుకు నమస్కరించు కోవాలి. నమస్కరించు కోవలసింది "ఇచ్చాడనే కానీ ఇస్తాడని కాదు. ఇవ్వమని కాదు".

చివరిగా జీవిత సత్యాన్ని తెలుసుకునే ధ్యానం చెయ్యగలిగే అవకాశం కలిగించినందుకు నమస్కరించుకోవాలి.

# దైవభీతి కాదు- పాపభీతి వుండాలి!

సాధారణంగా అందరూ దైవానికి భయపడతారు. ఇది సమాజంలో అందరిలో వున్న అభిప్రాయం. ఎందుచేతనంటే రోజూ పూజ చేస్తూ, ఏదైనా ఒక రోజు పూజ మానేస్తే ఎంతో భయపడతారు. కారణం పూజ చెయ్యకపోతే దేవుడు కోపిస్తాడని వారి వుద్ధేశ్యం. అలాగే వారం, వారం గుడికి వెళ్ళేవారు, ఒక వారం గుడికి వెళ్ళకపోతే భయపడతారు. కారణం ఏదైనా కీడు జరుగుతుందేమోనని వారి ఉద్దేశం. ఎవరికైనా కష్టం కలుగుతుందేమోనని శంకిస్తారు. కారణం గుడికి వెళ్ళకపోతే దేవునికి కోపం వస్తుందని వారి భయం.

అలా అంతా దేవునికి భయపడుతూ దైవభీతితో జీవిస్తున్నారు. గమనిస్తే అంతా **"దేవునికి భయపడుతున్నారు, కాని, పాపాలు చెయ్యటానికి మాత్రం భయపడరు".** అందుకే పాపాలు యధేచ్ఛగా, ధైర్యంగా చేసేస్తుంటారు. గమనిస్తే ఎవరికీ **'పాప భీతి లేదు'.** అందుకే లోకంలో ఎక్కడ చూసినా పాపాలు చేసేవారే ఎక్కువ వుంటారు. పాపాలు చేసేవారు ఎక్కువ వుండడం వల్లే, లోకంలో మానవులు ఇన్ని బాధలకు, కష్ట,నష్టాలకు గురవుతున్నారు.

ఎక్కువమంది పాపాలు చేసున్నారనడానికి నిదర్శనం. లోకమంతా దుఃఖంలో వుండడమే. ఎవరూ పాపాలు చెయ్యకపోతే లోకంలో దుఃఖమే వుండదు కదా? అంటే యదేచ్ఛగా అంతా పాపాలు చేస్తున్నట్టే కదా? పాపభీతి లేనట్టేగా? కాని మానవులకు వుండవలసింది "పాపభీతి". కాని మానవులకు వున్నది "దైవభీతి".

మానవుడు దైవానికి భయపడవలసిన అవసరం లేనే లేదు. కారణం అంతా ఆయన బిడ్డలే కాబట్టి. ఆయనకు రాగ, ద్వేషాలు ఉండవు. అంటే ఎవరిమీదా అనురాగమూ వుండదు. ఎవరి మీద ద్వేషమూ వుండదు. ఆయనకు అంతా సమానం. పూజించిన వారిని ఒక రకంగా, పూజించని వారిని ఇంకొక రకంగా ఆయన చూడడు. ఆయన 'సాక్షీభూతుడు'. అందరినీ అలా గమనిస్తూ వుంటాడు. సృష్టిలోని ఏర్పాటు

ఏమిటంటే ఎవరైనా మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు ఫలితాలు కలుగుతాయి. అందుచేత పూజ చెయ్యలేదని, ప్రార్థించలేదని భయ పడవలసిన పనిలేదు. అసలు దేవునికి భయపడవలసిన పనే లేదు.

మానవుడు భయపడవలసింది పాపాలు చెయ్యటానికి. కారణం, పాపాలు చేస్తేనే కష్టాలు వస్తాయి. ఎక్కువ పాపాలు చేస్తే ఎక్కువ కష్టాలు, తక్కువ పాపాలు చేస్తే తక్కువ కష్టాలు, ఎలాంటి పాపాలు చేస్తే అలాంటి కష్టాలు. అందుచేత కష్టాలు తెచ్చే పాపాలు చెయ్యటానికి భయపడాలి. అంటే 'పాపభీతి' వుండాలి. కాని మానవునకు 'దైవభీతి' ఎక్కువగా వుంది.

అసలు మానవుడు చేసే "పూజలవల్ల భగవంతునికి వచ్చే లాభమూ లేదు. పూజ మానేస్తే వచ్చే నష్టమూలేదు". మానవుడు పాపం చేస్తేనే ఆయనకు నష్టం. కారణం పాపమంటే లోకానికి కలిగించే కష్టనష్టాలు. అలా లోకానికి కలిగే నష్టమే భగవంతునికి కలిగే నష్టం. కారణం లోకమే భగవంతుడు కనుక. అందుచేత మానవునకు "పాపభీతి వుండాలి". పాపం చెయ్యని వారు దేనికీ భయపడవలసిన పనిలేదు. కారణం వానికి ఏ విధమైన కష్టాలు రావు. అందుచేత "దైవభీతి కాదు - పాపభీతి వుండాలి" అని తెలుసుకోవాలి.

ధ్యానం చేస్తే ఇది బాగా అర్థం అవుతుంది.

> శ్రవణం అనేది ఎంతటి జ్ఞానికైనా తప్పదు.
> \- బ్రహ్మర్షి పత్రీజీ

# దేవుడు ఎవరు?

శ్లో॥ **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**
**ఆనందో బ్రహ్మేతి వ్యజావాత్ ॥**

సత్యము, జ్ఞానము, అనంతము, ఆనందము ఈ నాలుగు లక్షణములు ఉన్నదే బ్రహ్మము అంటే దేవుడు. వీటిని కొంచెం విపులంగా తెలుసు కుందాం.

**1) సత్యము :-**

ఏది వేదములలో 'సత్' అని చెప్పబడుతుందో, ఏది కాలము మారినా మార్పు చెందకుండా వుంటుందో, ఏది అన్ని సంకల్పాలకు అధిష్టానమై వుందో అదే సత్యం.

**2. జ్ఞానము :-**

ఏది స్వయం ప్రకాశమై, ఏది సర్వ ప్రకాశమై, ఏది ఆవరణ రహితమై, చిత్స్వరూపమై ఉందో, ఏది అనాది, అనంతమై, నిరంతర వృత్తి రహితమై, వృత్తి సాక్షి చైతన్యమై ఉందో అదే జ్ఞానం.

**3. అనంతము :-**

దేనికి చావు పుట్టుకలు లేవో, ఆకారము లేదో, కుండలు వేరైనా మట్టి ఒక్కటే అన్నట్టు ఆభరణాలు వేరైనా బంగారం ఒక్కటే అన్నట్టు, వస్త్రాలు వేరైనా నూలు ఒక్కటే అన్నట్టు, కనబడే ప్రపంచమే కాదు, కనబడని లోకాల పర్యంతం, సర్వత్రా వ్యాపించి, పరిపూర్ణమై ఉన్న ఆ చైతన్యమే అనంతం.

**4. ఆనందము :-**

సముద్రం నుండి ఏర్పడిన అలలకు, నదులకు ఆ సముద్రమే అధిష్టానముగా వుంటుంది. అలాగే అన్ని జీవుల ఆనందమయ, సుఖ స్వరూపానికి, ఆ బ్రహ్మమే అధిష్టానంగా వుంది. అలా అన్ని జీవులకు అధిష్టానమై, నిత్యమై, శుద్ధమై, అఖండమై, అద్వైతమై, జ్ఞానానందమయ స్వరూపమై ఉండే బ్రహ్మమే ఆనందం.

ఇలాంటి లక్షణములు గల స్వరూపమే భగవంతుడని అంటే దేవుడని తెలుసుకోవాలి. ఆ లక్షణములు గలదే ఆత్మ. అంటే ఆత్మే దేవుడు. ఆ ఆత్మ వున్న దేహమే దేవాలయమని శ్రీశంకరాచార్యుల వారు తెలియచేశారు. అంటే ఏ శక్తిచే, ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములు జరుగుతున్నాయో, సృష్టిలోని సమస్త లోకాలు నడవటానికి కారణమో, మూలాధారమో, ఆ శక్తే దేవుడు. ఏదైతే స్వయం ప్రకాశమో, అనంత శక్తి వంతమో ఆ చైతన్యమే దేవుడు.

# దిగజారి ప్రవర్తించవద్దు!

లోకంలో గమనిస్తే చాలామంది మానవుల ప్రవర్తన వారి స్థాయికి తగ్గట్టు వుండదు. సృష్టిలో 84 లక్షల జీవులు వున్నాయంటారు. వారిలో మానవుడే ఉన్నతమైనవాడు అంటారు. ఒక్క మానవునికే బుద్ధి ఇవ్వబడిందని అంటారు. అలాంటప్పుడు మానవుని ప్రవర్తన అన్నిటికంటే ఉన్నతంగా ఉండాలి. కానీ ఎన్నో సందర్భాలలో తన స్థాయిని మరచి, దిగజారి ప్రవర్తిస్తుంటాడు.

ఎందుచేతనంటే సృష్టిలోని ఏ జీవిని, ఏ ప్రాణిని, ఏ జంతువును చూసినా అవి వాటి స్థాయికి తగ్గట్టు ప్రవర్తిస్తాయి. వాటి ప్రవర్తన వాటి స్థాయి కంటే దిగజారదు.

ఉన్నతుడైన మానవుడే వాడి స్థాయి కంటే తక్కువైన జంతువులలా ప్రవర్తిస్తూంటాడు. అందుకే మానవుల ప్రవర్తన దిగజారినపుడు క్రింది స్థాయిలో వున్న జంతువులతో పోల్చి మందలిస్తూంటారు, తిడుతుంటారు. కానీ ఏ జంతువును అలా మందలించరు, తిట్టరు. దానికి కారణం అవి వాటి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించడమే.

చూడండి ఎవరైనా తన పనులు చేయకుండా ఊరమ్మట తిరుగుతుంటే, ఏమిటిరా అడ్డగాడిదలా తిరుగుతున్నావని, గాడిదతో పోలుస్తారు. అదేలోకంగా తింటుంటే, పందిలా తింటున్నావని పందితో పోలుస్తారు. బాగా తిని బలిస్తే దున్నపోతులా బలిసావని దున్నపోతుతో పోలు స్తారు. వెకిలి వేషాలు వేస్తుంటే, ఏమిటే కోతి చేష్టలు? అని కోతితో పోలుస్తారు. ఖాళీగా కూర్చుని మెల్లిగా అరుస్తుంటే, ఏమిటా పిల్లి కూతలు? గట్టిగా అరుస్తూంటేఏమిటి కుక్కలా మొరుగుతున్నావు ? బాగా శరీరం పెంచితే ఏనుగులా తయారయ్యావని అంటారు.

అలా మానవుల ప్రవర్తన దిగజారినపుడు జంతువులతో పోలుస్తారు. అంటే మానవుడు తన స్థాయి కంటే దిగజారి ప్రవర్తిస్తున్నట్టే కదా? చూడండి మానవుడినే తిడతారు. కానీ ఏ జంతువుని తిట్టరు. ఒక ఆవును పందిలా అశుద్ధం తింటున్నావని తిట్టరు. కారణం ఆ పని ఆవు చెయ్యదు. అలాగే గుర్రాన్ని ఎద్దులా నడుస్తున్నావని తిట్టరు. కారణం అది ఆ పని చెయ్యదు. ఎప్పుడూ దాని వేగం వేగమే. ఇంకా మానవుడే కళ్లెం వేస్తాడు. ఇంకా శాఖాహార జంతువులైన ఆవు, గేదె మేక, ఏనుగు లాంటివి వాటికి ఆహారం లేకపోతే ఎన్నాళ్ళైనా సరే కృంగి కృసించి

చనిపోవటానికైనా సిద్ధపడతాయి కాని మాంసాన్ని ముట్టవు. అవి వాటి స్థాయికి తగ్గట్టు ప్రవర్తిస్తాయి. భగవంతుని నిర్ణయానికి అనుగుణంగా ప్రవర్తిస్తాయి. వాటి శరీరం శాఖాహార నిర్మితం కాబట్టి శాఖాహారమే భుజిస్తాయి. కాని మానవుడు తన దేహం శాఖాహార నిర్మితమైనా కూడా మాంసాహారం భుజిస్తూ హింస చేస్తున్నాడు. తన స్థాయికి తగ్గట్టు ప్రవర్తించడం లేదు.

మరి మానవుడు ఎందుకు జంతువులతో పోల్చబడుతున్నాడు? ముఖ్యంగా మానవుడు తనకు ఇవ్వబడిన బుద్ధిని, అంటే తెలివిని ఉపయోగించక పోవడం. ఆలోచించగల శక్తి వుండి, ఏమీ ఆలోచించక, మూఢంగా, మూర్ఖంగా, ప్రవర్తించడమే కాకుండా అజ్ఞానపు పెద్దలను, సమాజాన్ని అనుకరించడమే మానవుడు దిగజారి ప్రవర్తించడానికి కారణం.

మానవుడు ప్రతీ విషయంలో మూఢంగా ఆలోచిస్తూ వస్తున్నాడు. అంటే ఏ పనైనా తాను ఆలోచించి, మంచి చెడ్డలు విశ్లేషించి తనకు ప్రయోజనం చేకూరుతుందా? తన ఉన్నతికి ఉపకరిస్తుందా? అని చూడడు. తనకు ప్రయోజనం చేకూరకపోయినా తరతరాల నుంచి ఆచారంగా వస్తుందని ఆచరిస్తాడు. అందరూ ఆచరిస్తున్నారని ఆచరిస్తాడు. పెద్దల, పండితులు చెప్పారని ఆచరిస్తాడు. కానీ తన బుద్ధిని ఉపయోగించడు. అందుచేతే జీవితంలో కష్టాల పాలవుతున్నాడు.

బుద్ధిని ఉపయోగించేవాడు ఉన్నతంగా ప్రవర్తిస్తాడు. బుద్ధిని ఉపయోగించనివాడు దిగజారి ప్రవర్తిస్తాడు. మరి బుద్ధిని ఉపయోగించాలన్నా, బుద్ధి వికసించాలన్నా, దిగజారి ప్రవర్తించకుండా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేసే కొద్దీ ప్రతీ మానవుడు ఉన్నతంగా ప్రవర్తిస్తాడు. మహాత్ములలా ప్రవర్తిస్తాడు. గొప్పవాడు కాగలుగుతాడు. దిగజారి ప్రవర్తించడు.

> ఎక్కువగా విని తక్కువగా మాట్లాడాలి.
> -బ్రహ్మర్షి పత్రీజీ

# భగవంతుడు విగ్రహంలోనే వున్నాడా?

తరతరాలుగా లోకంలో విగ్రహారాధన, ఫొటో ఆరాధన ఆచారంగా వస్తూంది. విగ్రహారాధననే భగవదారాధనగా భావిస్తున్నారు. అలాచేస్తూ తమ కష్టాలు, సమస్యలు, రోగాలు నయం చేసుకోవచ్చని కూడా భావిస్తున్నారు. తరతరాలనుంచి ఆచారంగా వస్తుంన్నందువల్ల భగవంతుని ఆరాధించే సరైన మార్గం అదేనని భావిస్తున్నారు. తమ కోరికలు నెరవేరక పోయినా తప్పకుండా ఎప్పడో ఒకప్పడు భగవంతుడు నెరవేరుస్తాడని నమ్ముతున్నారు. నమ్మకంతో ఎంత కాలమైనా ఎదురు చూస్తున్నారు.

విగ్రహారాధన భగవదారాధన ఎలా అవుతుంది? భగవంతునికి నామరూపాలు లేవు కదా? అని అడిగితే భగవంతునికి రూపం లేదు, రూపం లేని భగవంతుని ఆరాధించడం సాధ్యం కాదు, కానీ అన్ని రూపాలు ఆయనవే, ఏ రూపాన్ని ఆరాధించినా భగవంతుని ఆరాధించినట్టే అందుచేత నీకు ఇష్టమైన రూపాన్ని ఆరాధించుకో అని పెద్దలు చెప్పారు కదా? అని అంటారు. అలాగే ఆయనకు పేరు లేదు కాబట్టి ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు అని చెపుతారు.

అలా చెప్పి సరిపెట్టుకుంటారు. తాము చేస్తున్న పని సరైనదనుకుంటారు. తాము భగవంతుని ఆరాధిస్తున్నామనుకుంటారు. కానీ నామరూపాలు లేని భగవంతుని ఆరాధించే అవకాశం ఉందా? లేదా? అని ఆలోచించరు. తమ బుద్ధిని ఉపయోగించరు.

ఎంతసేపూ భగవంతుడంటే కోరికలు తీర్చే వాడన్నట్టుగా భావిస్తారు. విగ్రహం కనిపించినా, ఫోటో కనిపించినా కోరికలు కోరుతుంటారు. అంతేకానీ ఆ భగవంతుని గురించి, ఆయన శక్తిని గురించి ఆయన సిద్ధాంతాలను గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించరు. నామ రూపాలు లేని భగవంతుని ఎలా ఆరాధించాలో తెలుసుకోరు, తెలుసు కోవటానికి ప్రయత్నించరు.

గాంధీగారి ఫొటోని చూపిస్తూ గాంధీ గారి ఫొటో అంటాం కానీ, గాంధీగారు అనంకదా? వెళ్ళి షేక్ హేండ్ ఇవ్వలేం కదా? ఆయన విగ్రహాన్ని కూడా, విగ్రహమే అంటాం కానీ గాంధీగారు అనం కదా? అలాగే భగవం తుని విగ్రహం భగవంతుడెలా అవుతాడు? అని అడిగితే భగవంతుడు సర్వాంతర్యామి కదా? అన్నిటిలో వున్నట్టే కదా? అలాగే విగ్రహంలో కూడా

భగవంతుడు వుంటాడు కదా? విగ్రహాన్ని ఆరాధిస్తే భగవంతుని ఆరాధించి నట్టే కదా? విగ్రహాన్ని ఆరాధిస్తే తప్పేమిటి? అని అంటారు.

అంతా అంతవరకే ఆలోచిస్తున్నారు. కానీ ఆలోచించవలసింది ఇంకా వుంది. ఇక్కడ విగ్రహంలో భగవంతుడున్నాడు అన్నది వాస్తవమే. అంటే భగవంతుడు విగ్రహంలో వున్నాడు, కానీ విగ్రహం భగవంతుడు కాదు కదా?

కాని అందరి ప్రవర్తన విగ్రహంలో భగవంతుడున్నట్టుగా ఉండదు. విగ్రహమే భగవంతుడన్నట్టు ఉంటుంది. అంటే విగ్రహం ఎదురుగా పవిత్రంగా వుంటారు. అంటే ఆలయంలోనే పవిత్రంగా వుంటారు. తర్వాత ఎక్కడ ఎవరిని చూసినా ఆ పవిత్రత కనబడదు.

పైగా విగ్రహంలో భగవంతుడు లేడా? అని ప్రశ్నిస్తారు. అలా ప్రశ్నించే వారు ఆలోచించాలి భగవంతుడు విగ్రహంలోనే వుంటాడా? అన్నిటిలోనూ ఉంటాడు కదా? ఎందులో లేడు ? అలాంటపుడు మనం అన్నిటిని పవిత్రం గా చూడాలి కదా ? చూస్తున్నామా? అన్నిటిని ఆరాధ్యభావంతో చూడాలి కదా? చూస్తున్నామా? అన్నిటిని ఆరాధించాలి కదా? ఆరాధిస్తున్నామా?

మనం ఒక్క విగ్రహాన్ని తప్ప, దేనినీ భగవం తునిగా భావించం, పవిత్రంగా చూడం. కానీ కుర్చీలో, మంచంలో అన్నిటిలో వున్నట్టే కదా? మరి భగవంతుని మీద ఎలా కూర్చోగలుగుతున్నాం. ఆయనను అవమానించినట్టే కదా? ఆయనను భాధిస్తున్నట్టే కదా?

అలాగే ఒక రాయిలోనే భగవంతుడు వున్నపుడు అన్ని జంతువులలో కూడా భగవంతుడు వున్నట్లే కదా? మరి మనం ఎన్ని జంతువులను ప్రతీరోజూ హింసిస్తున్నాం. వాటిని క్రూరాతి క్రూరంగా హింసించి చంపి, వాటి మాంసాన్ని తింటున్నాం. అంటే భగవంతుని హింసిస్తున్నట్లేకదా? ఎందుకు ఇలా చేస్తున్నాం? విగ్రహంలో భగవంతుడు లేడా? అని ప్రశ్నించేవారు ఇవన్నీ ఎందుకు ఆలోచించరు?

అన్నిటిలో భగవంతుడు వున్నాడు. విగ్రహంలో కూడా భగవంతుడు వున్నాడు. అందుకే విగ్రహాన్ని ఆరాధిస్తున్నాను, అని వాదించేవారు అన్నిటిని పవిత్రంగా చూడాలి. భగవత్ స్వరూపంగా భావించాలి.

గమనిస్తే మనం ప్రతీరోజూ ఎన్ని చీమల్ని, దోమల్ని , ఈగల్ని, ఎల కల్ని, బొద్దింకల్ని చంపటంలేదు. వీటిలోకూడా భగవంతుడున్నాడు కదా? మరి వాటిని ఎందుకు చంపుతున్నాం? ఎందుకు ఆరాధించటం లేదు?

ఇంకా గమనిస్తే పెరట్లో, తోటల్లో మందులు చల్లి ఎన్ని జీవుల్ని చంపటం లేదు. అవన్నీ భగవంతుని స్వరూపాలుకాదా కాదా? ప్రతీరోజూ అంత పాపం చేస్తూ విగ్రహంలో భగవంతుడు లేడా? అని తెలివిగా ప్రశ్నిస్తున్నామంటే భగవంతుని గూర్చి మనం ఏమి అర్థం చేసుకున్నట్టు? ఆయనంటే మనకు నిజంగా ఇష్టమా? నిజంగా ఇష్టమయితే ఆయన రూపాల్ని చంపగలమా? హింసించ గలమా? అలా చేస్తున్నామంటే భగవంతుని గూర్చి మనం చెప్పేమాటలన్నీ అసత్యాలే కదా? పైకి భగవంతుడు అంటే ఇష్టమంటాం. కాని చేతలు మటుకు భగవంతుని హింసించే విధంగా వుంటాయి. ఎంత విచిత్రం.

విగ్రహంలో భగవంతుడు లేడా? అందుకే నేను విగ్రహాన్ని ఆరాధిస్తున్నాను. విగ్రహంలో భగవంతుడున్నాడు కాబట్టి నేను విగ్రహాన్ని భగవంతునిగా భావిస్తున్నాను. అనే వారు అంతకన్నా ఆలోచించనక్క రలేదా? మరి విగ్రహంలోనే భగవంతుడు ఉన్నపుడు సాటి మనుషులలో భగవంతుడు ఉండడా? మరి అందరినీ ప్రేమిస్తున్నామా? ఇది ఆలోచించ నక్కరలేదా? ఎంతసేపూ మన స్వార్థం, మన ఆనందమే కానీ ఇతరుల గురించి ఆలోచిస్తున్నామా?

నా కుటుంబమని, కుటుంబంకోసం, కుటుంబ ఆనందంకోసం కష్టపడుతున్నాం, కృషి చేస్తున్నాం. అంతా భగవంతుడైనపుడు ఇతరులు కూడా భగవంతుడే కదా? ఇతరుల ఆనందం కోసం ఎందుకు ప్రయత్నించం? ఒక్క విగ్రహాన్నే ఆనం దింప చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాం కానీ ఇతరులను ఆనందింప చెయ్యటానికి ఏ ప్రయత్నం చేస్తున్నాం? విగ్రహంలో వున్న భగవంతునికి పళ్ళు, ఫలాలు, నైవేద్యాలు పెట్టి ఆనందింపచేస్తున్నాం. సాటి మానవులలో వున్న భగవంతునికి ఏమి పెట్టి ఆనందింపచేస్తున్నాం ?

వారిముందు తాము తిని ఆనందిస్తున్నారే కానీ వారికి ఏమి పెడుతున్నారు? ఇంటిలో పని వారిని ఎంతమంది తమతో సమానంగా చూస్తున్నారు? తాముతినగా మిగిలినవి, వాసన వచ్చినవి, పాడైపోయినవి, ఎవరూ తినట్లేదని ఇస్తారు కానీ తమతో సమానంగా పెట్టరు. అంటే తాము అధికులు భగవంతుడు తక్కువవాడా? విగ్రహంలో భగవంతుడు లేడా? అని ఆరాధించేవారు, ఎవరిని తక్కువగా చూసినా, భాధించినా, భగవంతుని తక్కువగా చూసినట్లేనని తెలుసుకోవాలి.

ఏదో ఒక్క విగ్రహంలోనే భగవంతుడున్నట్లు విగ్రహన్ని ఆరాధిస్తే

భగవంతుని ఆరాధించినట్లేని భావిస్తూ, విగ్రహారాధన చేస్తూ తాము గొప్పపని చేస్తున్నట్లుగా, గొప్పవారైనట్లుగా భావిస్తే సరిపోతుందా? నిజంగా భగవంతుని మీద భక్తి, గౌరవంవుంటే, భగవంతునిగూర్చి తెలుసుకోవాలి. ఆయన తత్వాన్ని అర్ధం చేసుకోవాలి దానికి తగ్గట్టు ప్రవర్తించాలి. మన బుద్ధిని, వివేకాన్ని ఉపయోగించాలి.

సర్వాంతర్యామి అయిన భగవంతుడు సర్వత్రా వ్యాపించి వున్నాడు. ఆయన అంతటా అన్నిటా వున్నాడు. ఆయన లేనిదంటూ లేదు. ఆయన విగ్రహంలో కూడా వున్నాడు. కాని ఆలోచించాలి. ఆయన విగ్రహంలో ఎలా వున్నాడు? ఏ రూపంలో వున్నాడు? నిజంగా విగ్రహంలో వున్న ఆయన్ను చూడగలమా? చూడలేం. అది అసాధ్యం. కారణం భగవంతుడు చైతన్యస్వరూపుడు. విగ్రహంలోనే కాదు, ఆ చైతన్యం సర్వత్రా, సర్వజీవులలో వ్యాపించివుంది.

భగవంతుని చైతన్యం ఒక్క మానవులలోనే పూర్తి చైతన్యవంతమై వుంది. ఆ చైతన్యాన్నే ఆత్మ అని అంటారు. అన్నిటిలోకంటే మానవులలోవున్న ఆత్మే, సత్యమైన పూర్ణమైన భగవంతుడు. అందుచేత భగవత్ సాక్షాత్కారం అంటే ఆత్మ సాక్షాత్కారం ఒక్క మానవునిలోనే, మానవునికే సాధ్యం తప్ప ఇంక వేటిలో ఎవరికీ దర్శించే అవకాశం లేదు.

అందుకే "God Sleeps in Stones, Awakes in Plants, Moves in Animals & Thinks in Man" అని అంటారు.

విగ్రహంలో లేడా అని వాదించేబదులు తనలో వున్న భగవంతుని ఆరాధించి, దర్శించటానికి ప్రయత్నించాలి. ఆ ప్రయత్నమే ధ్యానం.

ధ్యానం విశేషంగా చేస్తే అంతరంలో వున్న ఆత్మను దర్శించగలుగుతాం. దర్శించడమేకాదు, ఆ ఆత్మ ఎవరోకాదు నేనే అని తెలుసుకోగలుగుతాం. "అహం బ్రహ్మాస్మి" అన్న సత్యాన్ని అవగతం చేసుకుంటాం.

విగ్రహం భగవంతుడు కాదా? లేక భగవంతుడు విగ్రహంలో లేడా? అని వాదించడం కాదు. "నేనే భగవంతుణ్ణి" అన్న సత్యాన్ని తెలుసుకోవాలి. విగ్రహంలో భగవంతుడులేడా? అని కోరికలు కోరడానికి ప్రయత్నించినంత మాత్రాన ప్రయోజనం లేదు. కారణం కోరేవాడే భగవంతుడు కనుక.

శిలని రూపంగా మార్చి కోరితే, శిల ఏమి ఇవ్వ గలదు. శిల గొప్పదా? భగవంతుడు గొప్పవాడా? భగవంతుడే గొప్పవాడుకదా? మరి పూజిస్తే తప్పేమిటి? శిలను కోరితే తప్పేమిటి? అని వాదిస్తే ఎంత మూర్ఖత

"భగవంతుడే రక్షించు, రక్షించు అంటే ఇంక ఆయన్ను రక్షించే వారెవరున్నారు?"

మానవుడు తానెవరో తెలుసుకోలేక, తనశక్తిని మరచిపోయి దిగజారి ప్రవర్తించడమే కాక, వాదించడం మరీ విడ్డూరం కాక మరేమిటి?

కొంచెం ఆలోచిస్తే ఆలయం బయట యాచించే వారు లాభపడుతున్నారు. ఆలయం లోపల యాచించే వారు నష్టపోతున్నారు. కారణం, ఏమీ లేకుండా బయట యాచించే వారికి సాయంత్రానికి కొన్ని రూపాయలైనా వస్తాయి. కానీ లోపల యాచించేవారు, కొబ్బరికాయ ఇస్తే, చిప్ప మాత్రమే వస్తుంది. పళ్ళు ఇస్తే, సగమే వస్తాయి. అంటే సగం నష్టపోతున్నారు.

కారణం బయట యాచించేవారు భగవంతుని అడుగుతున్నారు, లాభపడుతున్నారు. కానీ లోపల యాచించే వారు నష్టపోతున్నారు. కారణం వారు శిలా విగ్రహాన్ని అడుగుతున్నారు.

విగ్రహం భగవంతుడు కాదు. "విగ్రహాన్ని కోరే మానవుడే భగవంతుడు". ఇదే పూర్ణ సత్యం. ఈ సత్యాన్ని తెలుసుకోనంత వరకు మానవుడు దుఃఖాన్ని పొందుతాడు, దుఃఖంలోనే జీవిస్తాడు.

మానవుడు దుఃఖం నుంచి బయటపడాలంటే ఈ సత్యాన్ని తెలుసుకోవాలి. దానికి ధ్యానం ఒక్కటే మార్గం. మానవుడు ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని పాట్లు పడినా ధ్యానం చేయకుండా ఈ సత్యాన్ని తెలుసుకోలేడు.

ఎన్నో జన్మలెత్తి, ఎంతో దుఃఖమనుభవించి, ఎన్నో కష్టాలు పడి అప్పుడు ధ్యానం చేసే బదులు ఇప్పడే , ఈ జన్మలోనే ధ్యానం చేస్తే అన్ని జన్మలెత్తవలసిన పనిలేదు. ఇన్నిపాట్లు పడవలసిన పనిలేదు. అందుచేత ధ్యానం చేద్దాం. దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడదాం.

ఇతరుల దోషాలను చూడకుండా, స్వంత దోషాలను సరిచేసుకోవాలి. - బ్రహ్మర్షి పత్రీజీ

# "ఒరిజినల్! - డూప్లికేట్!"

లోకంలో ఒరిజినల్ వస్తువులు వుంటాయి, డూప్లికేట్ వుంటాయి. ఎవరైనా ఒరిజినల్‌కే ప్రాముఖ్యం ఇస్తారు. కారణం ఒరిజినల్ శాశ్వతం. డూప్లికేట్ తాత్కాలికం. గమనిస్తే ఒరిజినల్ బంగారు వస్తువులు శాశ్వతంగా మెరుస్తుంటాయి. కాని డూప్లికేట్ గిల్టు నగలు కొన్నాళ్ళకే వాటి వన్నె కోల్పోతాయి. అందుచేత ఎవరైనా ఎంత ఖరీదయినా ఒరిజినల్ బంగారు వస్తువులను సంపాదించుకోవటానికే ప్రయత్నిస్తారు. ఒకవేళ ఏ షాపు వాడైనా, డూప్లికేటు వస్తువులు ఇస్తే నష్టపోయామని బాధపడతారు.

అలాగే ఒరిజినల్ డైమండ్స్ మెరుపు గొప్పగా శాశ్వతంగా వుంటుంది. కాని గాజు రాళ్ళ మెరుపు అంతంత మాత్రమే. అలాగే బజారులో కొనే సరుకులలో ఎవరైనా ఒరిజినల్ వస్తువులే కొంటారు. మందులు కూడా ఒరిజినల్ మందులే కొంటారు. ఒరిజినల్ మందులు కొంటే రోగం తగ్గుతుంది. డూప్లికేట్ మందులు వాడితే ప్రాణం పోతుంది. అంటే ఏదైనా ఒరిజినల్ వల్ల ప్రయోజనముంది కాని డూప్లికేట్ వల్ల అంతా నష్టమే జరుగుతుంది.

ఇంకా చదువుకునే పిల్లలకు ఒరిజినల్, పులి, సింహం, ఎలుగు లాంటివి చూపించలేనపుడు వాటి డూప్లికేట్ బొమ్మలు చూపిస్తాం. అవి ఇలా వుంటాయి, వాటి లక్షణాలు ఇవి, అవి ఈ పనులు చేస్తాయి. అవి క్రూరమైనవి, వాటికి కోరలు, గోళ్ళు వుంటాయి. సాధు జంతువులను చంపి తింటాయి. అని చెప్తాం. ఏది ఏమైనా మనం చూపించిన బొమ్మ డూప్లికేటే కాని ఒరిజినల్ కాదు. అంటే చూడలేనటువంటి వాటిని గుర్తించడం కోసం డూప్లికేట్ వాడతాం. అలాగే వారు ఏ 'ZOO' కి వెళ్ళినా **ORIGINAL** సింహాన్ని చూడగానే వెంటనే నిజం సింహం, నిజం సింహం అని అంటారు. ఎంతో ఆనందపడతారు. ఇప్పటిదాకా తాను చూసింది డూప్లికేట్ బొమ్మ సింహం కాబట్టి ఒరిజినల్ సింహం చూసినంత అనుభూతి , ఆనందం కలగదు. ఏది ఏమైనా ఒరిజినల్-ఒరిజినలే, డూప్లికేట్-డూప్లికేటే.

అలాగే ఎవరి భార్య చనిపోయినా, మరల ఇంకొక భార్యను చేసుకుంటారు. అంతే కాని పాత భార్యలాగ వుండే డూప్లికేట్ బొమ్మను

చేయించి కాపురం చెయ్యరు? కారణం డూప్లికేట్ బొమ్మ భార్యకు **ORIGINAL** అసలు భార్యకు చాలా తేడా వుంటుంది. అసలు భార్య అయితే ఎన్నో రకాల సుఖాలు ఇస్తుంది, సేవ చేస్తుంది, శారీరక వాంఛలు తీరుస్తుంది, ఇష్టమైనవి చేసి పెడుతుంది, ఇంటి పనులన్నీ చూసు కుంటుంది, కష్టమొచ్చినప్పుడు ఊరడిస్తుంది. ఇలా అసలు భార్య వల్ల ఎన్నో లాభాలున్నాయి.

అదే డూప్లికేట్ భార్య అయితే, పై వాటిలో ఏ లాభం ఉండదు సరికదా ఇంకా ఆ బొమ్మకే సేవ చెయ్యవలసి వస్తుంది. సుఖం లేకపోగా అన్నీ కష్టాలే, లాభం లేకపోగా అన్నీ నష్టాలే, ప్రయోజనం లేకపోగా అన్నీ ఇబ్బందులే. ఎంత తేడా వుంటుందో ఆలోచిస్తే మనకే తెలుస్తుంది. అందుచేత అంతా ఒరిజినల్‌గా వుండే మరొక భార్యనే చేసుకుంటారు. కానీ మొదటి భార్య లాంటి డూప్లికేట్ బొమ్మను చేసుకోరు. ఎటువంటి పరిస్థితులలో ఇష్టపడరు.

గమనిస్తే నిజ జీవితంలో ఏ విషయంలోనైనా ఒరిజినల్ వల్ల లాభాలు పొందుతున్నాం. డూప్లికేట్ వల్ల నష్టపోతున్నాం. అందుకే అన్నిట్లలో ఒరిజినల్‌నే కోరుకుంటాం.

విచిత్రమేమిటంటే మానవులు అన్ని విషయాలలో 'ఒరిజినల్' కోరుకుంటారు. కానీ భగవంతుని విషయంలో మాత్రం జీవితాంతం 'డూప్లికేట్ భగవంతుడినే' ఆశ్రయిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. 'ఒరిజినల్ భగవంతుని' పూర్తిగా మరిచిపోయారు. ఇంకా విచిత్రమేమిటంటే డూప్లికేట్ విగ్రహాన్ని, ఫోటోని కూడా ఒరిజినల్ అనే భావిస్తున్నారు, నిజమైన భగవంతుడనుకుంటున్నారు. ఎంత విచిత్రమంటే ఎన్నో తెలివితేటలు వున్నాయనుకునే మానవుడు భగవంతుని విషయంలో అసలైన (ఒరిజినల్) భగవంతుని మరచిపోవడం, ఆయన గురించి ఆలోచించక పోవడం, ఆయన నిజతత్వాన్ని, నిజస్థితిని తెలుసుకుని ఆరాధించక పోవడం నిజంగా ఇది చాలా శోచనీయం!

అడవిలో కనబడని సింహాన్ని తీసుకురాలేరు, చూపించలేరు కాబట్టి ముందుగా బొమ్మ సింహాన్ని చూపిస్తారు. కాని బొమ్మ నిజం సింహం కాదు కదా? ఒరిజినల్ సింహాన్ని చూసిన ఆనందం కలుగదు కదా? అలాగే ఆకారం లేని భగవంతుని చూపించలేరు కాబట్టి ఆయన

శక్తులు, గుణగణాలు బట్టి బొమ్మ ఆకారం తయారుచేసి పెద్దలు మనకు ప్రాథమికంగా బోధిస్తారు. అంతే కాని ఆ ఆకారం భగవంతుడు ఎలా అవుతాడు? ఆయనను చూపించలేరు కనుక డూప్లికేట్‌వి కొన్ని, ఊహా రూపాలు కొన్ని తయారు చేసి చూపిస్తున్నారు, డూప్లికేట్ ఆకారం దేనికంటే భగవంతుడనేవాడున్నాడు అని తెలుసుకుని ఆ ఒరిజినల్ భగవంతుని అన్వేషించి, ఆయన దర్శనం పొందటానికి మాత్రమే.

అందుకే నిజమైన భగవంతుని దర్శనం పొందినవారి ఆనందానికి అవధులు వుండవు. గమనిస్తే డూప్లికేట్ భగవంతుని అంటే విగ్రహం దర్శనం చేసుకున్న వారి కష్టాలకు కొదువ వుండదు. కారణం ఒరిజినల్ భగవంతుడు అనంత శక్తిస్వరూపుడు, ఆనందస్వరూపుడు, ఆయన్ను ఆశ్రయించిన వారిని కోరకుండానే అనుగ్రహిస్తాడు. కాని డూప్లికేట్ విగ్రహం కోరినా, మొక్కినా, ప్రార్థించినా అనుగ్రహించలేడు.

ఒరిజినల్ భగవంతుని అంటే ఆత్మను ఆశ్రయించిన వారికి అన్నీ లాభాలే. డూప్లికేట్ భగవంతుని అంటే విగ్రహం ఆరాధించిన వారి జీవితం వ్యర్థం, దుఃఖమయం. అందుచేత ఒరిజినల్ ఎప్పుడూ ఒరిజినలేనని తెలుసుకోవాలి.

తెలివైనవారు, వివేకవంతులు, యోగులు ఎప్పుడూ నిరాకార, నిర్గుణ, సర్వాంతర్యామి అయిన ఒరిజినల్ భగవంతుని 'ధ్యానం' ద్వారా ఆరాధిస్తారు. ఆయన ఎవరో కాదు అందరిలో వున్న 'ఆత్మ'. ఆత్మ ఆరాధన చేస్తే అంటే ధ్యానం చేస్తే ఒరిజినల్ భగవంతుని ఆరాధించినట్టే.

అందుచేత మనం కూడా యోగులులా ధ్యానం చేసి ఒరిజినల్ భగవంతుని అంటే ఆత్మను ఆరాదిద్దాం. దుఃఖం నుండి బయటపడదాం. మోక్షం పొందుదాం.

> సరియైన దృక్పథాలు బుద్ధత్వ ప్రాప్తికి అంకురాలు.
> -బ్రహ్మర్షి పత్రీజీ

# గురువంటే?

మొదట గురువు అనే పదానికి అర్థం తెలుసుకుందాం.

1. గు :- అంధకారం రు:- జ్యోతి స్వరూపం

అంధకారాన్ని రూపు మాపే జ్యోతి స్వరూపమే గురువు అని అర్థం దీనికి ఇంకొక అర్థం కూడా వుంది.

2. గు :- గుణాతీతం రు:- రూపవర్జితం

గుణ రూప రహితమైన పరబ్రహ్మ స్వరూపం గురువు. ఇంకొక అర్థం కూడా చెప్పకోవచ్చు.

3. గు :- అజ్ఞానం రు : జ్ఞానం

అజ్ఞానాంధకారం పోగొట్టి జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు.

ఉత్తమ గురువు అర్హతలు :

1. గురువు జ్ఞాని అయి వుండాలి. జ్ఞానమంటే విషయ పరిజ్ఞానం; పాండిత్యం కాదు; స్వయం ప్రతిభ, స్వప్రజ్ఞ కలవాడై వుండాలి.

2. గురువు కర్మిష్ఠి అయి వుండాలి. అంటే కర్మలాచరిస్తూ వుండాలి తప్ప సన్యాసి, విరాగి, కాకూడదు.

3. గురువు ధ్యాన తత్పరుడైన యోగికావాలి అంటే ఫలితాలను ఆశించకుండా కర్మలాచరించాలి. అంటే నిజమైన కర్మయోగి అయి వుండాలి.

ఈ మూడు గుణాలు లేనివాడు గురు పదవికి అర్హుడు కాలేడు. డాంబికాలు పలుకుతూ ఆడంబరంగా జీవించేవారు అవతార పురుషులమని విర్రవీగేవారు సద్గురువులు కాలేరు.

అందుచేత గురువైన వాడు స్వయం సాధకుడై వుండాలి. సాధనలో వుండే కష్ట సుఖాలు అనుభవించినవాడై వుండాలి. బ్రహ్మానుభూతిని రుచి చూసిన వాడై వుండాలి. ప్రజ్ఞాశాలి అయి వుండాలి. అలాంటి గురువు మాత్రమే ఇతరులకు మార్గదర్శి కాగలడు. ఇతరులకు మంచి మార్గాన్ని చూపగలడు.

అలాంటి గురువు మహాత్ముడై వుండాలి. కరుణా హృదయుడు కావాలి. ఆయన అంతరంగం కరుణారసప్లావితం అయి వుండాలి. తన శక్తితో శిష్యుల భవ బంధాలు త్రెంచగల వాడై వుండాలి.

అలాంటి గురువే జ్ఞాన నిధి, తత్వ నిధి. జ్ఞానం ఆత్మజ్ఞానం ఎందరికి పంచి పెట్టినా తరగదు. అలా సత్యాన్ని తానై తెలుసుకోగలిగిన వాడే గురువు.

ఏ తాత్విక విషయాన్నైనా తడుముకోకుండా, ఆలోచించకుండా వివరించి చెప్పగలగాలి. ఆయనకు ఆ విషయాలు అంతకు ముందు తెలిసి ఉండకపోవచ్చు. సందర్భానుసారంగా ఆయనకు స్ఫురిస్తాయి. అదే ప్రజ్ఞా విశేషం.

గురువుది ప్రత్యక్ష జ్ఞానం. దానిని మించిన జ్ఞానం ఇహలోకంలో శాస్త్ర పఠనం వల్ల కానీ, పాండిత్యం వల్ల కానీ లభించదు. అందుకే అనుభవాన్ని మించిన ప్రమాణం లేదు అంటారు. గురువు అనుభవంతో చెపుతాడు. **శాస్త్రం ఎల్లప్పుడూ ప్రమాణం కాదు. శాస్త్ర ప్రమాణం శిష్యునికి అనుభవంలోకి రానపుడు దానిని వదిలివేయవలసిందే. అపుడు గురువు అనుభవమే ప్రమాణం.** అనుభవ జ్ఞానంతో గురువు బోధించిన విషయలు గ్రహించి ఉపదేశించిన మార్గంలో నడవాలి. అలా గురువు చూపించిన సాధన వల్ల జన్మ పరంపర నుండి విముక్తి పొందడం సాధ్యమవుతుంది.

మనం పుణ్యం కోసం, పురుషార్థం కోసం సముద్ర స్నానాలు, నదీ స్నానాలు చేస్తుంటాం. గుళ్ళు, గోపురాలు దర్శించి పుష్కరిణీ స్నానాలు చేసి విగ్రహదర్శనం చేసుకుంటాం. **సప్త సాగర పర్యంతం వ్యాపించి వున్న భూభాగంలో అన్ని నదులలోను స్నానం చెయ్యడం వల్ల కలిగే పుణ్యం కన్నా ఆత్మాభివృద్ధే మిన్న.** అది సద్గురువు వల్లే సాధ్యం.

వేదాలు అటు నుండి ఇటు, ఇటు నుండి అటు పఠించే ఘనాపాఠీలకు గాని, ఉపనిషత్తులు కంఠతా పెట్టి ఉపన్యాసాలు చెప్పినా కానీ, జ్ఞానం అబ్బదు. అంతే కాకుండా కాషాయం ధరించి, శిరోముండనం చేయించుకుని మఠాలలో ఉన్నా సరిపోదు.

**సత్యమైన బ్రహ్మం మనస్సు దాటిన తరువాత మాత్రమే ధ్యోతకమవుతుంది. మనస్సుతో దానిని తెలుసుకోలేం.** బ్రహ్మం నిర్గుణం, నిరామయం, నిరంజనం కనుక దానిని తెలుసుకోవటానికి జ్ఞానం చాలదు ప్రజ్ఞ కావాలి. అది సద్గురువు వల్లే సాధ్యం. ఆయన అందించిన సాధన వల్లే సాధ్యం.

అంధుడు సూర్యోదయాన్ని చూడనట్లు, మూఢుడు గురు రూపాన్ని, గురుతత్వాన్ని అర్థం చేసుకోలేడు. అజ్ఞానం వల్లనే కాదు అహం భావం వల్ల కూడా గురువుకు దూరం అవుతాడు.

సాధకుడు రూప ధ్యానం వదలి, అరూప స్థితికి చేరి, నిర్గుణోపాసన చేసి, రూపాతీతమైన పరబ్రహ్మతత్వం గ్రహించాలంటే గురువు ఎంతగానో సహకరిస్తాడు. అందుకే సద్గురువును ఆశ్రయించాలి అన్నారు.

# "గురువులలో రకాలు!"

బోధించే వారంతా గురువులే కానీ వారంతా ఒకే స్థాయిలో వుండరు. శాస్త్రాలలో గురువులను 7రకాలుగా విభజించారు.

1. సూచక గురువు :- లౌకికమైన, ప్రాపంచిక విద్యలను నేర్పే గురువును సూచక గురువు అంటారు.

2. వాచక గురువు :- వర్ణాశ్రమాది విషయాలకు సంబంధించిన విద్యను, ధర్మాధర్మములు తెలిపే విద్యను బోధించే గురువును వాచక గురువు అంటారు.

3. కుల గురువు :- పంచాక్షరీ మొదలైన మంత్రాలను ఉపదేశించే గురువును, కుల గురువు అంటారు. వీరు మత సాంప్రదాయాలు కూడా బోధిస్తారు. కాబట్టి కుల గురువు అంటారు.

4. నిషిద్ధ గురువు :- చేతబడులు, భూతప్రేత, పిశాచాలు మొదలైన తుచ్ఛ మంత్రాలు ఉపదేశించే గురువును నిషిద్ధ గురువు అంటారు.

5. విహిత గురువు :- సంసారం అనిత్యమని చెప్పి దానికి వైరాగ్య మార్గాన్ని బోధించేవారిని విహిత గురువుఅంటారు.

6. కారణ గురువు :- 'అహం బ్రహ్మాస్మి' 'తత్వమసి' లాంటి మహా వాక్యాలు బోధించి, దుఃఖ నివారణా మార్గం బోధించేవారిని కారణ గురువు అంటారు.

7.పరమ గురువు : సమస్త సంశయాలు సమూలంగా నిర్మూలించి మరణ భయం పోగొట్టి, సంసార బంధం నుండి బయటపడే మోక్ష మార్గాన్ని చూపించేవారిని పరమ గురువు అంటారు.

ఈ పరమ గురువులు ఆధ్యాత్మిక శిఖరాలు చేరుకున్నవారు. **వీరు ఎంతటి మహా జ్ఞానులైనా, ఎంతటి మహా యోగులైనా లోకంలో అతి సామాన్యంగా జీవిస్తుంటారు. తమ ఔన్నత్యాన్ని బయటపడనీయరు.** బొత్తిగా ప్రచారం కోరరు. ఎంతసేపూ లోక కళ్యాణం కోసం పాటు పడుతూ వుంటారు.

అనేక జన్మలలో చేసిన పుణ్యం వల్ల పరమ గురువు లభిస్తాడు. అటువంటి పరమ గురువు పొందిన వారు మరల సంసార బంధంలో

పడరు. అందుచేత పరమ గురువును పొందటానికి ప్రయత్నించాలి.

గురువులంతా సర్వజ్ఞులు కారు. బ్రహ్మానుభూతులు కారు. వారిలో జ్ఞానం లేని వారు కూడా ఉంటారు, అబద్ధాలాడేవారు, డాంబికాలు పలికేవారు వుంటారు. అన్నీ తమకు తెలిసినట్లు నటిస్తూ వుంటారు. తమని తాము పొగుడుకుంటూంటారు. కారణ జన్ములమని చెప్పకుంటారు. వారు ఇతరులకు నేర్పేది ఏమీ వుండదు. అలాంటి గురువుల వల్ల ప్రయోజనం వుండదు.

నదిని దాటడానికి శిలను ఆశ్రయిస్తామా? లేదు శిలను ఆధారం చేసుకుని నదిని దాటలేం. అలాగే అనుభవం లేని గురువుని నమ్మి ప్రయోజనం లేదు. **తాను తరించని వాడు ఇతరులకు తరించే మార్గం ఎలా బోధించగలడు?**

అందుచేత అశక్తులు, అయోగ్యులు, అహంబావులైన గురువుల్ని వదిలిపెట్టడం మంచిది. వేషాలు వేసి, కాషాయాలు ధరించి తాము పరిశుద్ధులైనట్లు నటిస్తారు. అలాంటి వారిని ఆడంబర గురువులు అంటారు. అలాంటి వారి శిష్యరికం ప్రమాదకరం.

తమకు సాష్టాంగ నమస్కారం చేయకపోతే ఆగ్రహించే గురువులు వుంటారు. వారిది మేక పోతు గాంభీర్యం. అలాంటి వారి వల్ల శిష్యులకు ఆధ్యాత్మికాభివృద్ధి కలగకపోగా కష్టనష్టాలు ఎదుర్కొంటారు.

అందుచేత గురువును ఎన్నిక చేసుకునే ముందే శిష్యుడు జాగ్రత్తపడాలి. నీవు నాకు శిష్యుడు కమ్మని ఏ ఉత్తమ గురువు అర్థించడు. సాధకుడే గురువును ఎన్నుకోవాలి.

ఆత్మ విశ్వాసం కోల్పోకుండా అందరితోనూ స్వేచ్ఛగా మసలగలగాలి - బ్రహ్మర్షి పత్రీజీ

# శిష్యుడంటే?

శిష్యులు రెండు రకాలు 1. జ్ఞానాన్ని అర్థించేవారు, 2. మోక్షాన్ని అర్థించేవారు.

తేనెటీగ ఒక్క పూవు తేనెతో తృప్తి చెందదు. అనేక పుష్పాలపై వాలి తేనె త్రాగుతుంది. మంచి తేనె కడుపు నిండుగా లభించేంత వరకు పూలను అన్వేషిస్తూనే వుంటుంది.

అలాగే జ్ఞానార్థి అయిన శిష్యుడు ఒక్క గురువుతో తృప్తి పడడు. తన జ్ఞాన పిపాస తీరే వరకు ఎందరో గురువుల్ని దర్శించి సేవిస్తాడు. కడకు తన ఆర్తికి, ఆశయానికి తగిన గురువు వద్ద స్థిరపడి సర్వ సమర్పణ చేసుకొని ఆయనొక్కరిని తన గురుదేవునిగా భావిస్తాడు. ఆయనకు అంకితమై పోతాడు. అలా సద్గురువు లభించేంత వరకు ఆరాటం, అన్వేషణ సాగుతుంది.

జిజ్ఞాసులు, గుణవంతులు అయిన శిష్యులు జ్ఞానమూర్తులైన వారినే గురువుగా అంగీకరిస్తారు. కనిపించిన వారికెల్లా నమస్కారం చెయ్యరు. గురువు వేషభాషల్ని బట్టి కాక, ఆత్మ సంస్కారాన్ని, ప్రజ్ఞను అంచనా వేయగల శక్తి అలాంటి జిజ్ఞాసాపరులైన, గుణ సంపన్నులైన శిష్యులకు వుంటుంది.

శిష్యుని అర్హతలు :

సద్గురువులు శిష్యుని స్వీకరించే ముందు వారి గుణ గణాలు, శీల స్వభావాలు, ప్రవర్తన, క్రమ శిక్షణ, సంస్కారం లాంటివి ఎన్నో పరిగణనలోకి తీసుకుంటారు.

ఆత్మస్తుతి చేసుకుంటూ పరులను విమర్శించి నిందించేవారు, పాపకార్యాలు చేసేవారు, దైవ చింతనలేని వారు, ఆధ్యాత్మిక అవగాహన బొత్తిగా లేనివారు, మంద బుద్దులు, మొండివారు, వ్యసన పరులు, కృతజ్ఞత లేనివారు, ఆచారం సత్ప్రవర్తన లేనివారిని శిష్యులుగా స్వీకరించరు. అలాంటి వారు శిష్యులుగా పనికిరారు కూడా.

అలాగే చేయవలసిన కర్మలు చేయని వారు, క్షమాగుణం లేనివారు, పరులను నిందించే బుద్ధి కలవారు, అనవసరంగా వాదనలకు దిగేవారు, లోభ గుణం కలవారు, కాముకులు, కోపిష్టి వారు, హింసా

ప్రవృత్తి కలవారు, మూర్ఖుల లాంటి వారిని సద్గురువులు శిష్యులుగా అంగీకరించరు. స్వధర్మం పాటించని వారిని, జ్ఞాన తృష్ణ లేని వారిని, నైతిక ప్రవర్తన లేని వారిని, పాప భీతి లేని వారిని సద్గురువులు శిష్యులుగా స్వీకరించరు.

అందుచేత ఎక్కువ వివేకం, విచక్షణ చూపవలసింది శిష్యుడే. ఒక రకంగా  గురువును ఎన్నిక చేసుకోవడం కష్టమైన పనే. కారణం సద్గురువులు శిష్యుని అంచనాలకు, మేధకు అందరు. ఒక పట్టాన అర్థం కారు. పూర్వ జన్మ సుకృతం. ఈ జన్మలో చేసే పుణ్యం కలవారికే సద్గురువు లభిస్తాడు.

**శిష్యుని ప్రవర్తన :-**

శిష్యునికి సద్గురువు లభించిన తరువాత గురువును విస్మరించకూడదు.  కించపరచకూడదు. గురువు దగ్గర లేని శక్తులు తనకు సంక్రమించినా, అవి తనకు అనన్య గురుభక్తి వల్ల లభించాయనుకోవాలి  తప్ప అహంకరించకూడదు. అలా చేస్తే పరిపూర్ణత కలగదు.

శిష్యుడు ఎంత వివేకవంతుడైనా, పండితుడైనా, పేరు, ప్రఖ్యాతులు కలవాడైనా, గురువు తర్వాతివాడే. గురువు శిష్యుని ఎప్పడూ అందలం ఎక్కించడు. గొప్పవాడివని, జ్ఞానివని, ఉత్తమోత్తముడవని పొగడడు. శిష్యుడు సాధన చేసి ఔన్నత్యం  సంపాదించే కొద్దీ అణుకువ ప్రదర్శించాలి తప్ప అహంకరించకూడదు. ఎందుచేతనంటే ఎంత నేర్చినా ఇంకా గురువు నుంచి నేర్చుకోవలసింది చాలా వుంటుంది.

**శిష్యుడు తాను ఎదుగుతున్నాను అనుకుంటాడు. అంతకు పదింతలు గురువు పైకి పోతూనే వుంటాడు.** అభిమానం, పొగడ్త శిష్యుని అభ్యుదయానికి అవరోధం అని గురువుకు తెలుసు.

కలలో కూడా గురువు లోపాలు ఎన్నకూడదు. గురువు తరువాతే తాను అన్న విషయం మరువకూడదు. జీవించినంత కాలం శక్తి అనుగ్రహించేది. వెలుగు ప్రసాదించేది గురువే అని నమ్మాలి. గురువును నిర్లక్ష్యం చేస్తే ఎవరైనా పతనం చెందుతారు.

గురువు సమక్షంలో వినయ విధేయతలతో ప్రవర్తించాలి. ఎట్టి పరిస్థితులలోను అబద్ధం చెప్పకూడదు. ఆయన సన్నిధిలో అసహనంగా,

అయిష్టంగా, చిరాకుగా ఉండకూడదు. గురువు కూర్చున్న చోటుకు ఎత్తుగా కానీ, ముందుగా గానీ కూర్చోకూడదు. తాను గురువు కన్నా చిన్నవాడినని, విద్యార్థినన్న భావంతో మెలగాలి.

గురువు ముందు అనవసరంగా నోరు విప్పకూడదు. వితండవాదం చెయ్యకూడదు. తాను తెలివైన వాడినని అనిపించుకోవటానికి ప్రయత్నించకూడదు.. తనకు తెలిసిన దానికన్నా గురువు చెప్పింది భిన్నంగా వుండవచ్చు. అందులో ఆయన అనుభవం ఉంటుంది. గురువును చర్చలో ఓడించాలని, అవమానించాలని, తన ఆధిక్యత ప్రదర్శించాలని ఆలోచన చేసే శిష్యుడు మరు జన్మలో క్రూరంగా బ్రతకవలసి వస్తుంది.

మానవునికి వున్న 3 రకాల శాపాలైన ఋషిశాపం, నాగశాపం, దేవతాశాపం నుండి రక్షించే వాడు గురువే. ముడుపులు చెల్లించకపోతే ఆగ్రహించే క్షుద్రదేవతలు, నీచ దేవతల నుండి రక్షించగలవాడు కూడా గురువే.

అలాంటి గురువును అవమానించిన వాడు చులకన చేసేవాడు ఘోరంగా పతనం చెందుతాడు, భ్రష్టుడవుతాడు. అందుచేత సత్ప్రవర్తనతో గురువును పొందాలి. **విద్యార్థి కాకూడదు. శిష్యుడు కావాలి.**

వాస్తవానికి అంతర్జీవితమే బాహ్య జీవితానికి
పరిపూర్ణత నిచ్చేది. - బ్రహ్మర్షి పత్రీజీ

# "గురు కృప ఉంటే!"

సద్గురువు శిష్యుని స్వీకరించిన తరువాత ఆ శిష్యుని జ్ఞానవంతుని చెయ్యటానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తాడు. అలాగే శిష్యుని తనంతవానిగా చెయ్యటానికి ప్రయత్నిస్తాడు. ఆ రకంగా చెయ్యటానికి 4 రకాల దీక్షల ద్వారా ప్రయత్నిస్తాడు.

అవి **(1) దృక్ దీక్ష, (2) స్పర్శ దీక్ష, (3) వాక్ దీక్ష (4) మనోదీక్ష.**

**1. దృక్‌దీక్ష:-** "దీనినే మీన న్యాయమంటారు". చేపగ్రుడ్లను పెట్టి వెనుకకు తిరిగి వాటిని తీక్షణంగా చూస్తుంది. తల్లి చేప దృష్టి సోకగానే గ్రుడ్లు పిల్లలుగా మారతాయి.

అలాగే సద్గురు దేవుని కరుణామృత కటాక్ష వీక్షణాలు (చూపులు) ప్రసరించడం వల్ల శిష్యుడు జ్ఞాన పరిపుష్టి పొందుతాడు. అప్పటి నుండి అజ్ఞాన జీవితం వీడి, జ్ఞాన జీవియై ఆత్మను దర్శిస్తాడు.

**2. స్పర్శ దీక్ష :-** "దీనినే విహంగ న్యాయమంటారు". పక్షి గ్రుడ్లను పెట్టి పొదిగి తన రెక్కల స్పర్శచేత గ్రుడ్లను పిల్లలుగా చేయగలుగుతుంది.

అలాగే సద్గురువు తనదివ్యవరదాభయ హస్తంతో స్పర్శ ద్వారా శిష్యునికి ఆత్మజ్ఞానాన్ని అందిస్తాడు.

**3.వాక్‌దీక్ష :-** "దీనినే భ్రమరు కీటక న్యాయమంటారు". భ్రమరం ఒక కీటకాన్ని తెచ్చి గూటిలో పెట్టి ద్వారం దగ్గర ఝుంకార శబ్దం చేస్తుంది. కీటకం భ్రమరాన్ని చూస్తూ, భ్రమరంగా మారిపోతుంది. మకరందం స్వీకరిస్తుంది.

అలాగే సద్గురువు శిష్యునికి తన మృదు మధురమైన వాక్కులతో బోధ చేస్తూ తనలాగే తయారు చేస్తాడు.

**4.మనోదీక్ష :-** "దీనినే తాబేటి తలపు అంటారు". తాబేలు ఒక చోట గ్రుడ్లు పెట్టి ఆహారానికి వెళుతుంది. మేఘాలు, ఉరుముల శబ్దం వినగానే తాబేలు ఫలానా చోట నేను గ్రుడ్లు పెట్టాను. ఈ ఉరుము శబ్దానికి ఆ గ్రుడ్లు పిల్లలు కావాలని సంకల్పిస్తుంది. ఆ సంకల్ప బలంతో ఆ గ్రుడ్లు పిల్లలుగా తయారవుతాయి.

అలాగే శిష్యుడు ఎక్కడ వున్నా, అతను నేను చెప్పిన విద్యను శ్రద్ధగా ఆచరిస్తూ వుంటాడు. చాలా దీక్షగా ఆచరిస్తూ వుంటాడు. అతడు పరబ్రహ్మ జ్ఞానం పొందటానికి అర్హుడు. అతడు త్వరగా పరమార్థాన్ని పొందగలడు అని సంకల్పిస్తాడు. ఆ దివ్య సంకల్ప బలంతో శిష్యుడు అభివృద్ధి పొంది పరమార్థం పొందుతాడు.

సూర్య కిరణాలు సోకగానే పద్మాలు వికసించినట్లు, గురుదేవుని కరుణ సోకగానే వేద, వేదాలు, ఉపనిషత్ జ్ఞాన విషయాలు, సుధలు శిష్యునికి అందుతాయి. అందుచేత శిష్యుడు సద్గురువును ఆశ్రయించి ఆయన కృపను పొందటానికి ప్రయత్నించాలి. జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.

ఎవరైతే చావు గురించి భయపడుతుంటారో వాళ్ళ అభివృద్ధిని వారే ఆటంకపరుచుకున్నట్లు. -బ్రహ్మర్షి పత్రీజీ

# "గురువుల కోపం!"

శ్లో॥ కర్మణ్య కర్మణియః పశ్యేద కర్మణి చకర్మ యః॥
న బుద్ధిమాన్‌మనుష్యేషు న యుక్తః కృత్స్నకర్మకృత్ ॥

(భ.గీ.4-18)

తా॥ ఎవడు కర్మయందు అకర్మను, అకర్మము నందు కర్మను చూస్తాడో వాడే మానవులందరిలో బుద్ధిమంతుడు! వాడే యోగి అవుతున్నాడు! సకల కర్మలు ఆచరించిన వాడు అవుతున్నాడు!

ఎందుకంటే అన్నిటికి మనస్సే ప్రధానం అవటం వల్ల కర్మ చేయని వారికి, కర్మ చేసిన వారికి, వారి వారి భావాన్ని అనుసరించే ఫలితం కలుగుతుంది కానీ కర్మను బట్టి మాత్రం కాదు. ఇదే శ్రీకృష్ణపరమాత్మ పై శ్లోకం ద్వారా చెప్పింది. ఇది చాలా మందికి అర్థం కాక కర్మను చూస్తున్నారు కానీ ఆ కర్మలో వారి భావాన్ని గ్రహించలేకపోతున్నారు. గొప్ప యోగీశ్వరుడైన శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పింది సామాన్యులు అర్థం చేసుకోవటం చాలా కష్టం, చేసుకోలేరు కూడా.

ఇద్దరు సాధువులు ప్రయాణం చేస్తూంటే వారికి దారిలో ఒక యేరు అడ్డు వచ్చింది. అక్కడ ఒక స్త్రీ ఆ ఏరు దాటలేక అక్కడే నిలబడి ఉంది. ఈ సాధువులను చూడగానే ఆమె వాళ్ళను ఏరు దాటించమని కోరింది. వెంటనే వారిద్దరిలో ఒక సాధువు ఆమెను ఎత్తుకుని ఏరును దాటించాడు.

తరువాత ఇద్దరు సాధువులు తమ దారిన వెళ్ళిపోయారు. కొంత దూరం వెళ్ళిన తరువాత రెండవ సాధువు ఏమయ్యా స్త్రీని ముట్టుకుని అపచారం చేశావు? అన్నాడు. అపుడు మొదటి సాధువు మనం రెండు మైళ్ళు వచ్చాం. నువ్వు ఆవిడను ఇంకా మోసుకొస్తున్నావా? నేను ఆమెను అక్కడే వదిలేశానే? అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

ఇక్కడ గ్రహించవలసింది స్త్రీని ముట్టుకోక పోయినా రెండవ సాధువు మనస్సులో ఆ భావం ఉండటం వల్ల, రెండు మైళ్ళు వచ్చినా ఆవిడను మరచిపోకపోవటం వల్ల, భౌతికంగా కర్మ చేయకపోయినా, కర్మ చేసిన వాడయ్యాడు.

మొదటి సాధువు స్త్రీని ముట్టుకున్నా మనస్సులో ఆ భావం లేకపోవడం వల్ల కర్మ చేసినా, కర్మ చేయని వాడయ్యాడు. అందుచేత శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన ప్రకారం కర్మలో అకర్మ అంటే కర్మ చేసినా భావం

శుద్ధంగా ఉంది కాబట్టి మొదటి సాధువే యోగి క్రింద లెక్కించబడతాడు.

అలాగే పత్రి గారిని చూసి చాలా మంది అదేమిటి భగవంతుడం టారు. ఆయనకు అంత కోపమేమిటి? అని అంటారు, కొంతమంది పైకి అనలేక లోపల అనుకుంటారు. ఆయనతో సన్నిహితంగా ఉన్న వారికి కూడా ఇది అర్థం కాదు.

ఆయన కోపం వారి పొరపాటు మాటల మీద, చేతల మీదే కాని వారి మీద కాదు. ఆయన భావం వారి జీవితాన్ని సరిచేయటానికి, వారి గుణాలు మార్చటానికే. కానీ, వారి మీద పగ, కక్షతో కాదు. ఎందుకంటే ఆయనకు శత్రువులు లేరు. మిత్రులూ లేరు. అందుచేత ఆయన కర్మ చేసినట్టు కనబడినా ఆయన అకర్ముడే అంటే కర్మ చేయనివాడే.

అలాగే ఆయన దగ్గరకు ఎవరు వచ్చినా జ్ఞానాన్ని పొందటానికే వచ్చారని భావిస్తారు. జ్ఞానం కోసం వచ్చిన వారిని ఏ గురువైనా వారి అహంకారాన్ని పోగొట్టటానికే ప్రయత్నిస్తారు. వారి అహంకార స్థితిని బట్టి ఒకరిని కోపగించుకుంటారు, ఒకరిని చిరాకు పడతారు, ఒకరిని పట్టించుకోనట్లు ఉంటారు. ఒకరిని ఆప్యాయంగా పలకరిస్తారు. ఒకరిని కౌగలించు కుంటారు. ఒకరిని కొడతారు. ఇలా రకరకాలుగా ప్రవర్తిస్తారు.

గురువు ప్రవర్తన ఎప్పుడు, ఒకే రకంగా ఉండదు. శిష్యుని బట్టి ఉంటుంది. శిష్యునిలో అహంకారాన్ని తొలగించి వారిని జ్ఞానవంతులుగా చేయటానికే ఏ గురువైనా ప్రయత్నిస్తారు. అదే పత్రిగారి ఉద్దేశ్యం. అందుచేత కర్మలు చేస్తున్నా ఆయన అకర్ముడే, ఏ కర్మా ఆయనకు అంటదు. కృష్ణ భగవానుడు చెప్పింది కూడా అదే. అంతటి యోగీశ్వరుడైన బ్రహ్మర్షి పత్రి గారిని సామాన్యులు ఎలా అర్థం చేసుకోగలరు?

బంగారం కొట్టుకి వెళ్ళి వంకాయలు అడిగితే ఎలా ఉంటుందో? బ్రహ్మ జ్ఞాని అయిన పత్రిగారి దగ్గరకు వెళ్ళి జ్ఞానం అడక్కుండా మా అబ్బాయికి ఉద్యోగం వస్తుందా? అమ్మాయికి పెళ్ళవుతుందా? నా కాలు నెప్పి తగ్గుతుందా? అన్నట్లు వుంటుంది. ఆయనను ఎంత తక్కువ అంచనా వేస్తున్నాం?

పత్రి గారి కోపం అర్థం చేసుకోవాలంటే 'అసంగత్వం' అంటే ఏమిటో తెలుసుకోవాలి, కృష్ణ పరమాత్మ చెప్పింది అర్థం చేసుకోవాలి, ధ్యానం చేసి స్థాయిని పెంచుకోవాలి, అనవసరంగా విమర్శించ కూడదు. ముందు మన జీవితాన్ని సరిచేసుకోవాలి.

# "ధ్యానానికి ఆటంకాలు!"

ధ్యానానికి ముఖ్యమైన ఆటంకాలు. 1.అహంకారం, 2.మమకారం.

సహజంగా ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన అహంకారముంటుంది. మనలో వుండే ఈ రకరకాల అహంకారాన్ని అష్ట మదాలు అని కూడా పిలుస్తారు. మనం ధ్యానంలో పురోగతి సాధించాలంటే వీటిని జయించాలి. అందుచేత అష్టమదాలు గురించి తెలుసుకుందాం.

1. కులమదం : ఉన్నత కులస్తుణ్ణి అని గర్వించడం.
2. బలమదం : అందరికంటే బలవంతుణ్ణి అని గర్వించడం.
3. యవ్వనమదం : యవ్వనవంతుణ్ణి అని గర్వించడం.
4. రాజ్యమదం : పదవులు సంపాదించి నేనే పదవులు పొందగలిగాను అని గర్వించడం.
5. శీలమదం : మంచి పనులు చేస్తూ, మంచిగా ప్రవర్తిస్తూ అలా వున్నానని గర్వించడం.
6. తపోమదం : ఆధ్యాత్మిక చింతనలో వుంటూ తానే ధ్యాన సాధన చేస్తున్నాను. తానే ఎంతో ఎదుగుతున్నాను. ఇతరుల కంటే తన సాధన అధికంగా వుందని గర్వించటం.
7. రూపమదం : శారీరకంగా ఇతరుల కంటే అందంగా వున్నానని, ఆకర్షణీయంగా వున్నానని గర్వించడం.
8. ధనమదం : నేను డబ్బు వున్న వాడిని, ధనవంతుణ్ణి అని గర్వించడం.

ప్రతీ ఒక్కరు పై వాటిలో ఏదో ఒకటి, లేకపోతే కొన్ని రకాల గర్వాలతో జీవిస్తారు. పైకి కనబడకపోయినా లోలోపల అహంతో విర్రవీగుతుంటారు. అలా నేను అనే అహంతో విర్రవీగేవారు, ధ్యాన సాధనలో పురోగతి సాధించలేరు.

అలా 'నేను' అనే అహంకారంతో పాటు, 'నాది' అనే మమకారం కూడా ధ్యాన సాధనకు ఆధ్యాత్మిక పురోగతికి ఆటంకమే. ఈ మమకారాన్ని ఈషణత్రయం అంటారు.

1. ధనేషణ :- ధనం మీద మమకారం.
2. ధారేషణ :- భార్యమీద లేక భర్తమీద మమకారం.
3. పుత్రేషణ :- పిల్లల మీద మమకారం.

ఇలాంటి నావి, నాది అనే మమకారం కూడా ధ్యానానికి ఆటంకాలే.

అలాగే ఇంకా 6 రకాల బాధలు కూడా ధ్యానానికి ఆటంకాలే. వీటిని షడూర్మాలు అంటారు.

1. ఆకలి : ఆకలి కూడా ధ్యానానికి ఆటంకమే. అందుకే బుద్ధుడు మధ్యే మార్గాన్ని బోధించాడు. అంటే ఆకలితో ఉండవద్దు. అతిగా తినవద్దు. మితాహారం తీసుకోమన్నారు.

2. దాహం : దాహం కూడా ఆటంకమే. అందుచేత ధ్యానానికి ముందు తరువాత కొద్దిగా నీళ్ళు త్రాగాలి. పూర్వం ఋషులు కమండలంలో మంచినీరు ఉంచుకునే వారు.

3. శోకం : జీవితంలో కలిగే సమస్యలు, సంఘటనల వల్ల కలిగే బాధ కూడా ధ్యానానికి ఆటంకమే.

4. మోహం : కోరుకున్న వాటని పొందాలనే విపరీతమైన వాంఛనే మోహం అంటారు. ఇది కూడా ధ్యానానికి ఆటంకమే.

5. జననం : జన్మ వల్ల ఇంద్రియ సుఖాల మీద వాంఛ కలుగుతుంది. అది కూడా ధ్యానానికి ఆటంకమే.

6. మరణం : అనుకోకుండా సంభవించే మరణం కూడా చేసే సాధనకు ఆటంకమే.

అలాగే మనకు వున్న బలహీనతలు, వ్యసనాలు కూడా ధ్యానానికి ఆటంకాలే. వీటిలో సప్త వ్యసనాలు ముఖ్యమైనవి.

1. జూదం, 2. వ్యభిచారం, 3.మద్యపానం, 4.హింస, 5. ప్రతీ చిన్న విషయానికి శిక్షించే గుణం, 6.పంతం (మొండిపట్టుదల), 7.దుర్వ్యయం (డబ్బు నిష్ప్రయోజనంగా ఖర్చు పెట్టం).

అలాగే జీవితంలో మనకి కొన్ని ఆటంకాలు ఎదురవుతూ వుంటాయి. వాటినే విఘ్నత్రయం అంటారు.

1. అభావన :- చీకటిలో పోయే వాడికి సరైన దారి తెలియక ఎలా పోతుంటాడో అలాగే తానే భగవంతుడని తెలియక ప్రాపంచిక వ్యవహారాలే ముఖ్యమని భావిస్తూ అజ్ఞానంతో జీవించడమే 'అభావన' అంటారు. దీని వలన ధ్యానం మీద ఆసక్తి వుండదు.

2. విపరీతము :- చీకటిలో చెట్టును కానీ, స్థంభాన్ని కానీ చూసి దయ్యమనో, దొంగ అనో భావించినట్లుగా, ఈ ప్రాపంచిక భావంతో ఇతర దేవతలను బ్రహ్మంగా భావించి పూజించటాన్ని విపరీతము అంటారు. అందువల్ల ధ్యానం మీద విశ్వాసం ఉండదు.

3. సంశయము :- అలా చెట్టును చూచి దయ్యమని భయపడే వాడికి దారిన పోయే వాడు అది దయ్యం కాదు. చెట్టు అని చెప్పినా సంశయం తీరక ఇంకా భయపడుతుండే వాడివలే "తాను పరబ్రహ్మమని తెలిపినా కూడా తాను మానవుడినే దేవుడు వేరే వుంటాడు" అనుకుంటూ తాను మానవుడు కాబట్టి కష్టాలు వస్తాయనుకుంటూ దుఃఖపడటాన్ని సంశయం అంటారు. ఈ సంశయం వల్ల ధ్యానంలో పురోగతి సాధించవలేరు. అందుచేత ధ్యానంలోకి రారు, ధ్యానం చెయ్యరు. అందుచేత ధ్యానం చేసేవారికి 'అహం బ్రహ్మాస్మి' అన్నవేద వాక్కులో సంశయం ఉండకూడదు.

అలాగే ఇంకా కొన్ని దోషాల వల్ల కూడా ధ్యాన సాధనలో పురోగతి సాధించలేరు. వాటినే పంచమలములు అంటారు.

1. తిరోదానమలం :- ఎప్పుడూ పాపపుపనులు చెయ్యాలనిపించడం, పాపాలనే చేస్తుండటం.

2. మాయయే మలం :- 'పరబ్రహ్మమును 'మరచిపోయి ఇతర దేవతలను, వారి మంత్రాలను సత్యమని నమ్మటం, వాటిని బోధించటం.

3. మాయకమలం :- ఒకప్పుడైనా, ఆ పరమాత్మను ధ్యానం చెయ్యాలనే బుద్ధి లేకపోవడం.

4. కార్మిక మలం : వేదాంత విషయాలు పెద్దలు బోధించేటపుడు వాటిని సరిగా వినకుండా పరాకులో వుండటం.

5. అణువమలం :- 'బ్రహ్మజ్ఞానం' గురించి తెలుసుకునే అవకాశం కలిగినా కూడా దాని మీద శ్రద్ధ చూపించకపోవటం.

అందుచేత ధ్యానం బాగా కుదరాలన్నా, ధ్యానంలో మంచి స్థితికి ఎదగాలన్నా పై లోపాలు ఏమైనా వుంటే వాటిని సరిచేసుకోవాలి. లోపాలు వుంచుకుని ధ్యానం చేస్తే పురోగతి సాధించలేరు. ఫలితాలు నామమాత్రంగా వుంటాయి. పై లోపాలు , ఆటంకాలు అధిగమించాలంటే ఆహార విషయాలలో జాగ్రత్త తీసుకోవాలి. ధ్యానసాధన నమ్మకంతో, విశ్వాసంతో, భగవత్ సాధనగా భావించి బద్ధకించకుండా చెయ్యాలి. అలా సాధన చేస్తే చివరకు ఆత్మానుభూతి పొందగలం. జీవితాన్ని ధన్యం చేసు కోగలం. అందుచేత పట్టుదలగా ధ్యానం చేద్దాం.

## ధ్యాన సాధన ద్వారా మానవునిలో కలిగే పరివర్తన

ప్రారంభ స్థితిలో ఏ మానవుడైనా ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తిస్తాడు. అంటే అతని చేష్టలు వికృతంగానే వుంటాయి. కాని బుద్ధి ఉపయోగించి ధ్యాన సాధన చేస్తే విరుద్ధమైన చేష్టలు ప్రకృతికి అనుగుణంగా మారతాయి. అంతే కాదు. ధ్యాన సాధన విశేషంగా చేస్తే అతని చేష్టలు ప్రకృతి ధర్మాన్ని మించి వుంటాయి. అదే ధ్యాన సాధనలో పరాకాష్ట. చాలా మంది, ఎంత సేపు ధ్యానం చెయ్యాలి? ఎంత కాలం చెయ్యాలి అని సందేహపడుతుంటారు. కాని ఎవరైనా సరే, క్రింద సూచించిన సంస్కృత స్థితికి ఎదిగే వరకు ధ్యానం చెయ్యవలసిందే. దానినే భగవత్ స్థితి అంటారు. ఎటువంటి వారైనా ధ్యానం చేస్తే ఖచ్చితంగా భగవంతునిగా మారతారు. అలా ధ్యానం చేస్తూ తనను తాను గమనించుకుంటే వారిలోని మార్పు వారికే తెలుస్తుంది. అంటే రాక్షసుణ్ణి మాధవుడిగా మార్చగలిగే సాధనే ధ్యానం. ధ్యానం చేసే కొద్దీ మానవులలో మంచి పరివర్తన తప్పకుండా కలుగుతుంది. ఎవరైనా సరే లోక కళ్యాణానికి పాటు పడతారు. ఇది ప్రతీ ఒక్కరు గమనించవచ్చు. ఎలాంటి మార్పు వస్తుందో యీ క్రింది పట్టిక గమనిద్దాం.

| వికృతి | ప్రకృతి | సంస్కృతి |
|---|---|---|
| 1. ప్రకృతి విరుద్ధం | ప్రకృతి ధర్మం | ప్రకృతి ధర్మానికి మించినది |
| 2. అధమం | ఉత్తమం | ఉత్తమోత్తమం |
| 3. అధర్మం | ధర్మం | ఉత్తమ ధర్మం |
| 4. ధ్యానం చెయ్యకపోవడం | ధ్యానం చెయ్యడం | ధ్యాన పరాకాష్ట |
| 5. మాంసాహారం | శాఖాహారం | శ్వాసాహారం. |
| 6. ఇవ్వకుండా పుచ్చుకోవడం | పుచ్చుకున్న దానికి సరిపడా ఇవ్వడం | పుచ్చుకోకుండా ఇవ్వడం |

| వికృతి | ప్రకృతి | సంస్కృతి |
|---|---|---|
| 7. నాది నాదే, నీది నాదే అన్నభావన. | నాది నాదే, నీది నీదే అన్న భావన | నీది లేదు నాది లేదు అంతా ఆ పరబ్రహ్మం అన్న భావన. |
| 8. ఎంత వున్నా ఇతరులకు ఇవ్వకపోవడం. | వున్న దాంట్లో కొంత ఇవ్వడం. | తనకు వుందా, లేదా అని చూసుకోకుండా ఇవ్వడం. |
| 9. అపకారం చేయడం | ఉపకారం చేయడం | అపకారం చేసిన వారికి ఉపకారం చెయ్యడం |
| 10. హింసించడం | హింసించకపోవడం | హింసించిన వారిని క్షమించగలగడం |
| 11. మోసగించడం | మోసగించకపోవడం | మోసగించిన వారికి సాయం చెయ్యడం |
| 12. విమర్శించడం | విమర్శించకపోవడం | విమర్శించిన వారిని ప్రశంసించడం |
| 13. ద్వేషించడం | ద్వేషించకపోవడం | ద్వేషించేవారిని ప్రేమించడం |
| 14. తాను బాగుపడాలి. ఇతరులు పోవాలనుకోవడం. | తానే బాగుండాలనుకోవడం. | లోకమంతా బాగుండాలనుకోవడం. |
| 15. తన సుఖం కోసం ఇతరులకు కీడు చేయడం | తన సుఖం చూసుకోవడం. ఇతరులకు కీడు చేయకపోవడం | తన సుఖం వదలుకుని ఇతరులకు మేలు చేయడం |
| 16. కష్టపడడానికి ఇష్టపడకపోవడం. | కష్టపడడం. | రక్తం చిందించడం. |

| వికృతి | ప్రకృతి | సంస్కృతి |
|---|---|---|
| 17. తమో, రజోగుణాలు | సాత్వికగుణం | నిర్గుణం |
| 18. ఉద్ధరించమనడం | ఉద్ధరించుకోవడం | నేను అనేది లేదనుకోవడం |
| 19. ఎంతసేపూ గతం గురించి, భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఆందోళన చెందడం. | ఆందోళన చెందక పోవడం. | వర్తమానంలో జీవించడం. |
| 20. ఇతరులలోని చెడు చూడడం | ఇతరులలోని చెడుచూడకపోవడం. | ఇతరులలోని మంచే చూడడం. |
| 21. అరిషడ్వర్గాలకు బానిసవడం. | అరిషడ్వర్గాలను అదుపులో వుంచుకోవడం. | అరిషడ్వర్గాలను జయించడం. |
| 22. పాపాత్మ | పుణ్యాత్మ | పరమాత్మ |
| 23. పాపాలు చేయడం | పుణ్యం చేయడం | పాప పుణ్యాలకు అతీతంగా వుండడం. |
| 24. ఒక చెంప మీద కొడితే ఎదుటివాడి రెండు చెంపలు వాయించడం. | వాడి పాపాన వాడు పోతాడు అని వూరుకోవడం. | ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించడం |

| వికృతి | ప్రకృతి | సంస్కృతి |
|---|---|---|
| 25. శీతోష్ణాలకు, సుఖ దుఃఖాలకు, మానావమానాలకు, గెలుపు ఓటములకు చలించిపోవడం. | సహించడం | సమస్థితిలో ఉండడం. |
| 26. కనబడేవన్నీ శాశ్వతమనుకోవడం. | శాశ్వతమవునో కాదో తెలియకపోవడం. | కనబడేది ఏదీ శాశ్వతం కాదు అని తెలుసుకోవడం. |
| 27. లేనిదంతా ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా భావించడం. | లేనిదేదో, ఉన్నదేదో తెలుసుకోవటానికి ప్రయత్నించడం. | ఉన్నది ఉన్నట్టుగా, లేనిది లేనట్టుగా చూడటం. |
| 28. భగవంతుని నుంచి ఇష్టపడడం. | భగవంతుని ఇష్టపడడం. | భగవంతుడు ఇష్టపడడం. |
| 29. దోచుకోవడం | దోచుకోకుండా దాచుకోవడం | దాచుకోకుండా పంచడం |

# "మాంసాహారం కొందరి మహాపురుషుల అభిప్రాయాలు!"

కసాయివాడి వలె హింసాపూర్వకమైన పనులు చేస్తూ, అలాంటి క్రూరమైన ఆలోచనల్లోనే మునిగి వుండే వ్యక్తి దుష్టుడు, దురాచారుడు, పిరికివాడు, హంతకుడు, పరమ పాతకుడు మరియు దుష్టబుద్ధి గలవాడై ఉంటాడు. ఇలాంటి నీచమైన పద్ధతుల్లో డబ్బు గడించేవాడు చివరకు ఖచ్చితంగా నరకానికి పోతాడు. ఇలాంటి ప్రవర్తన గలవాడు తన అమూల్యమైన మానవ జన్మను పెంటకుప్పలో పారవేసుకుంటాడు.

- సంత్ నామదేవ్

మాంసం తినేవారి, మద్యం త్రాగేవారి హృదయం కఠోరమవుతుంది. ఇలాంటి కఠోర హృదయంలో పరమాత్మ ప్రకాశం ప్రకటితం కాదు.

- దాదూ దయాల్

ఈ శరీరాన్ని పోషించుకోవడానికి ఇతర ప్రాణులను వధించడమెందుకు? చీమలో, ఏనుగులో, పశువులో, మానవుడిలో అందరిలో వున్నది ఆ ఒక్కడైన పరమాత్మయే.

- మలూక్ దాస్

ఒక మేక పరమాత్మ దర్బారులో న్యాయం కోసం చేసే ఫిర్యాదు "ఓ ప్రభూ మానవుడు నా శిరస్సును ఖండించాడు, అతడి శిరస్సును కూడా ఖండించండి. పేదలకు, ధనికులకు ఒకే రకంగా న్యాయం చెయ్యండి" అని మేక పరమాత్మతో విన్నవించుకుంటుంది.

- వాజిద్ జీ

చంపిన జంతువు మాంసం తినడానికి యోగ్యం ఎలా అవుతుంది. పాపపు పనులు చేసి స్వర్గాన్ని ఎందుకు కాలదన్నుకుంటావు? జిహ్వారుచి కోసం జన్మను ఎందుకు నాశనం చేసుకుంటావు.

-పరసాజీ

మాంసం తిని, కిళ్ళీ నములుతూ, శరీరానికి అలంకరణలు చేసుకొని, సొగసుగా, వంకర తలపాగా చుట్టుకుని, కాళ్ళకు విలాసమైన పాదరక్షలు వేసుకుని, దర్పంగా నడుస్తావు. కానీ నీవు మృత్యువును చేరుకుంటున్నావని, యముడు నిన్ను మేకను చంపినట్లు పొడిచి చంపుతాడని తెలుసుకో

- నాయి బుల్లేషాహ్

"ముల్లా ఎందుకు అరుస్తూ 'బాంగ్' ఇస్తావు. అల్లాకు చెముడు లేదు. ముప్పై రోజులు ఉపవాసాలుండి, హింస చేసి, చంపి మాంసం

తింటావు. మరి ఖుదా దర్శనం నీకు ఎలా కలుగుతుంది? అసలును విస్మరించి ఘోర పాపాలను మూట కట్టుకుంటావు.

- గరీబ్ దాస్‌జీ.

మానవుడు ఎలాంటి పరిస్థితిల్లోనూ మాంసం తినడం సరికాదు. మనం పశువుల కన్నా ఉన్నతులం. మాంసం తిని నిమ్న శ్రేణికి చెందిన జీవుల వలె ప్రవర్తించడం మనకు యుక్తం కాదు.

- మహాత్మాగాంధీ

జీవులను చంపేవారు, జీవులను హత్య చేయమని సలహా ఇచ్చేవారు, జీవులను చంపి భోజనం వండేవారు, మాంసం కోసేవారు, అమ్మేవారు, తినేవారు, వండేవారు, తినిపించేవారు ఈ ఎనిమిది రకాల వారు హత్యలో భాగస్వాములే.

- మనుస్మృతి

చేపలు తింటూ, భంగు, రుధిర త్రాగుతూ ఎన్ని తీర్థాలు తిరిగినా, ఎన్ని వ్రతాలు ఆచరించినా, నియమబద్ధంగా జీవించినా, వారు నరకానికే వెళతారు.

- కబీర్

రోజంతా ఉపవాసం ఉండి నమాజు చేసి సాయంత్రం కోడిని చంపడం వల్ల మహమ్మదీయులు స్వర్గానికి పోలేరు. అలాగే తీర్థయాత్రలు, వ్రతాలు మొదలైనవి ఆచరిస్తున్నప్పటికీ జీవహత్య చేసే హిందువులు కూడా సద్గతిని పొందలేరు ముస్లింలు జంతువులను చాలా సేపు రక్తం ఓడుస్తూ కోస్తారు. హిందువులు ఒక్కవేటున నరుకుతారు. కానీ రెండూ కూడా పాపంతో కూడిన కర్మలే. ఇద్దరి ఇళ్ళకు నిప్పంటుకుంది. ఇద్దరూ నరకానికి వెళ్ళటానికి సిద్ధంగా వున్నారు.

-కబీర్

మట్టితో దేవీ, దేవతల, నిర్జీవ ప్రతిమలను చేసి వాటిని పూజిస్తూ, వాటి ఎదుట సజీవులను చంపి బలి ఇచ్చే వారికి అంత్యకాలమున అతి దుఃఖము, యాతనలు కలుగుతాయి.

-కబీర్

అందరిలో ఆ ఒక్కడైన పరమాత్మే ఉన్నాడంటూ మరి కోళ్ళను, జంతువులను ఎందుకు చంపుతావు. అలా బలవంతంగా చంపి తినేవాడు భగవంతుని ముందు కర్మల లెక్క అప్పగించవలసి వస్తుంది, దండన పొందుతాడు.

-కబీర్



# ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస
# ప్రపంచ మాస్టర్లలారా! ఏకం కండి!
# పిరమిడ్ ధ్యానుల 18 ఆదర్శ సూత్రాలు



1. సరైన ధ్యానం... అంటే ఆనాపానసతి ధ్యానం... క్రమం తప్పకుండా చేయాలి; ఆనాపానసతి ధ్యానాన్ని అందరిచేతా చేయించాలి.
2. ఆత్మవిజ్ఞాన పుస్తకాలను విస్తారంగా చదవాలి... ఉదాహరణకు : స్వామీ రామా, యోగానంద పరమహంస, ఓషో, లోబ్‌సాంగ్ రాంపా, కాస్టానెడా, జేన్ రాబర్ట్స్, రిఛార్డ్ బాక్, అనీబిసెంట్, లిండా గుడ్‌మాన్, దీపక్ చోప్రా, బ్రయాన్ వైస్, సిల్వియా బ్రౌన్, బార్బరా మార్సిన్యాక్.... మొదలైన మాస్టర్ల యొక్క అద్భుత గ్రంథాలు.
3. ధ్యానంలో కలిగే అనుభవాలను తోటి ధ్యానులతో విధిగా పంచుకోవాలి.
4. వీలయినంత వరకు మౌనాన్ని పాటించాలి.
5. పౌర్ణమి రాత్రులలో ధ్యానం తప్పనిసరి... వీలయినంత సామూహికంగా!
6. అవకాశం ఉన్న చోటల్లా పిరమిడ్ శక్తిని ఇతోధికంగా వినియోగించుకోవాలి!
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి!
8. మాంసాహారం ముట్టకండి! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమితాహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు అధికంగా చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్ననాటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ విధిగా గరపాలి.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణా కార్యక్రమాల్లో డబ్బు లావాదేవీలు పెట్టుకోకూడదు.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ ఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. స్వంత ఆత్మశక్తితోనే... సర్వ వ్యక్తిగత సమస్యలను, ఎప్పటికప్పుడు పరిష్కరించు కుంటూ వుండాలి.
16. సాధారణ గృహస్థ జీవితాన్ని ఆనందంగా గడపాలి.
17. అన్ని గ్రామాలలోనూ, అన్ని పట్టణాలలోనూ పిరమిడ్ ధ్యాన కేంద్రాలను విధిగా నెలకొల్పాలి.
18. ధ్యానానుభవాలనూ, ఆధ్యాత్మిక ప్రగతి విశేషాలనూ లిఖితపరచి విధిగా ప్రచురించాలి.

ప్రపంచంలో ఎక్కడ చూసినా, ఎవరిని చూసినా రోగాలతో, సమస్యలతో, బాధలతో, అశాంతికి లోనై దుఃఖపడుతున్నారు. దీనికి ముఖ్య కారణం అసత్యంలో జీవించడమే. ఎప్పుడైతే మానవులు సత్యాన్ని తెలుసుకుని, సత్యంలో జీవిస్తారో దుఃఖం దానంతట అదే తొలగి పోతుంది. సత్యాన్ని తెలుసుకుంటే శాశ్వత ఆనందాన్ని కూడా పొందవచ్చు.

ఎంతోమంది యోగులు, యోగీశ్వరులు మనకు సత్యాన్ని తెలుసుకునే మార్గాన్ని చూపించారు. వారంతా చూపించిన మార్గమే ఈ "సత్యమార్గం". పాఠకులు దీనిని అధ్యయనం చేసి, సత్యాన్ని తెలుసుకుని జీవితాన్ని ధన్యం చేసుకుంటారని ఆశిస్తూ...



మీ...
తటవర్తి వీరరాఘవరావు

రూ.130/-